SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 298 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 19 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

## నేను స్వతంత్రుడిని


- ఏఐ మోడల్ దుందుడుకు!
- ఆరు అనూహ్య ఘటనలను బయటపెట్టిన ఓపెన్ఏఐ
- సూచనలను దాటేసేలా సొంత ఆదేశాలు రాసుకున్న పరిశోధనా మోడల్




.. వివరాలు 4లో

## దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

- 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..
- రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు
- నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు



.. వివరాలు 4లో

## సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

- సమస్త సంతోషానికీ ధర్మమే మూలం: మోహన్ భాగవత్
- యువత ధర్మంపై చర్చించడం సంతోషకరమని వ్యాఖ్య
- అహంకారం, అపోహలను వీడాలని సూచన



4

## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే!



- హైకోర్టు తీర్పును స్వాగతించిన దానం
- ఎన్నికల పోరు కొత్తేమీ కాదని వ్యాఖ్య
- మళ్లీ పోటీ చేస్తానని స్పష్టీకరణ
- సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

2




# రైతాంగానికి అండగా ఉంటాం

### ఎల్నినోపై రైతులకు ముందే అప్రమత్తం చేశాం

### తాగునీటికే తొలి ప్రాధాన్యత

- పంటల ఎంపికపై ముందస్తు సూచనలు
- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తాం
- శాసనసభలో మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కృష్ణా జలాల్లో వాటా సాధిస్తామని స్పష్టీకరణ
- సింగూరుపై ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం: సీతక్క



**అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..** 2

> రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం ఎల్లవేళలా వెన్నుదన్నుగా నిలుస్తుందని, ఎల్నినో తీవ్రత మరియు సాగునీటి కొరతపై రైతులకు ముందే అవగాహన కల్పించామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్నినోపై శాసనసభలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడుతూ, ప్రజల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, తాగునీటి అవసరాలు తీరిన తర్వాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని వెల్లడించారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతాంగాన్ని ఒంటరిగా వదిలిపెట్టబోమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శాసనసభలో 'ఎల్నినో ప్రభావం-నివారణ చర్యలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. వర్షపాతం తగ్గే అవకాశం, సాగునీటి కొరతపై రైతులను ముందుగానే అప్రమత్తం చేశామని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు ఇచ్చామని తెలిపారు. ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై సమాచారం అందిస్తున్నామని, 'రైతు నేస్తం' ద్వారా జలాశయాల పరిస్థితిని రైతులకు వివరిస్తున్నామని చెప్పారు. నీరు అందుబాటులో లేని చోట పంటలు వేయమని చెప్పడం బాధ్యతారాహిత్యమవుతుందని వ్యాఖ్యానించారు. ప్రజల తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని, అవి తీరిన తర్వాతే అందుబాటులో ఉన్న నీటిని సాగుకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షిస్తున్నామని తెలిపారు.

మిగతా 2 లో

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు




- ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి కోల్పోయిన దానం
- స్పీకర్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు కొట్టివేత
- 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా ప్రకటించిన హైకోర్టు
- తీర్పుపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. దానం అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వస్తుందని స్ప ష్టం చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్

మిగతా 2 లో

## ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

- నాలుగు బృందాలుగా రంగంలోకి సర్వేయర్లు
- 325 సర్వే నంబర్ లో హద్దుల పరిశీలన
- ఎర్రవల్లి 325 సర్వే నంబర్ భూములపై ఉత్కంఠ



2

## వర్షాభావంపై కేంద్రం ఆదుకోవాలి

- శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ వినతి
- ఎల్నినోతో వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగిందని వెల్లడి
- ప్రత్యామ్నాయ పంటలకు కేంద్ర సహకారం కోరిన సీఎం

2






## ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా

3

## మొదట ఓటు చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ!

- ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు
- తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం
- బీజేపీ-ఈసీ చేతులు కలిపాయని ఆరోపణ
- ప్రజల తీర్పును కాపాడాలని డిమాండ్
- స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడతామని వెల్లడి

4





### 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి

## హైలెవల్ కమిటీ

- ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌కు చైర్మన్ బాధ్యతలు
- పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా నియామకం
- రేవంత్ కుటుంబ భూముల లెక్కలూ బయటపెడతామన్న కేటీఆర్, హరీశ్

2






# 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18(సమయం న్యూస్):** తెలంగాణలో వివాదాస్పదంగా మారిన 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధిత జాబితాలో చేరిన భూములకు సంబంధించిన వివాదాలను పరిశీలించి, బాధితులకు పరిష్కారం చూపే విధంగా కమిటీ విధివిధానాలను రూపొందించనుంది. సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22ఏ జాబితాలో పొరపాటుగా చేరిన ప్రైవేట్ భూములు, నిషేధిత భూములకు సంబంధించిన ఇతర వివాదాలను పరిశీలించి తగిన పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. రాష్ట్రంలో అటవీ, అసైన్డ్, దేవాదాయ శాఖలకు చెందిన 1.02 కోట్ల ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో పేర్కొన్నారు. వీటిని తొలగించే అధికారం మంత్రులకు కూడా లేదని స్పష్టం చేశారు. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా 2.50 కోట్ల ఎకరాల భూముల వివరాలు విదేశీ మాఫియా చేతుల్లోకి వెళ్లాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, అధికారుల పొరపాట్లతో ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. 22ఏ జాబితాలో 12 అంశాలను గుర్తించామని, సభ్యుల సూచనల ఆధారంగా పేదలకు న్యాయం చేస్తామని సీఎం తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులు నష్టపోతే కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్లు, వందల ఎకరాల ఆస్తులు సంపాదించిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట తొమ్మిది జిల్లాల్లో ఉన్న 439.30 ఎకరాల భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా అసెంబ్లీలో వెల్లడించారు. ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల్లో ప్రభుత్వ భూములతో పాటు రైతుల నుంచి తీసుకున్న భూములు ఉన్నాయనే ఆరోపణలపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. దీనిపై కేటీఆర్, హరీశ్‌రావు స్పందిస్తూ రేవంత్‌రెడ్డి కుటుంబం పేరిట కూడా వందల ఎకరాల భూములు ఉన్నాయని ఆరోపించారు. వాటికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని వారు ప్రకటించారు.

# ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

**మర్కూక్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిధిలోని భూములపై రెవెన్యూ అధికారులు సర్వేను ముమ్మరం చేశారు. మర్కూక్ మండలం 325 సర్వే నంబర్ పరిధిలోని 388 ఎకరాల భూమిలో బుధవారం సర్వేయర్లు నాలుగు బృందాలుగా జిల్లా సర్వేయర్ అనిల్, శంకర్, డివిజన్ సర్వేయర్ వంశీ, మండల సర్వేయర్ ప్రజ్వల సర్వే చేపట్టారు. ఫీల్డ్ లో సర్వే చేస్తుండగా మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో మరికొందరు సర్వేయర్లు ఉంటూ ఫీల్డ్ లో ఉన్న బృందాలకు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తూ సమాచారం సేకరించారు. ఈ సర్వేలో ప్రభుత్వ ఉన్నతాధికారులు నేరుగా పాల్గొనలేదు. 325 సర్వే నంబర్ లో మొత్తం 388ఎకరాల భూమి ఉంది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో కేసీఆర్ పేరు మీద గానీ, ఆయన కబ్జా చేసింది గానీ ఇంచు కూడా లేదు అని, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది తప్పు అని చెప్పారు. మరికొందరు రైతులు 325 సర్వే నంబర్ పరిధిలో దాదాపు 80 నుండి 90 ఎకరాల్లో చెరువు తవ్వించి దానికి పాండురంగ డ్యాం అని నామకరణం చేశారని, ఆ చెరువు కింద భూములు కోల్పోయిన తమకు ఇంకోచోట భూమి ఇప్పిస్తానని చెప్పి ఇప్పటివరకు ఇప్పించలేదని ఆరోపించారు. 325 సర్వే నంబర్ లోని లావణి పట్టా భూములు 388 ఎకరాలను తమ పేరు మీద శాశ్వతంగా పట్టా చేయాలని, తమ ఆధీనంలో ఉన్న భూముల జోలికి రావద్దని రైతులు సర్వే బృందాలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు సేవ్య నాయక్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో ప్రభుత్వ భూమి పూర్తి విస్తీర్ణం 388.5 గుంటల భూమి ఇది మూడు గ్రామాల శివారులను శివార్ వెంకటాపూర్,వరదరాజపూర్ ఎర్రవల్లి ఆనుకొని ఉన్నదని,ఎర్రవల్లి భూమిని సర్వే చేయమని అధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు ఇక్కడికి చేరుకొని నాలుగు బృందాలుగా ఏర్పడి డిజిపిఎస్ రోవర్తో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రి సర్వే చేయమని చెప్పడంతో డీజిపిఎస్ టెక్నాలజీతోనే నిర్వహిస్తున్నామని, ప్రతిది క్షుణ్ణంగా శాటిలైట్ ద్వారా పాయింట్లు తీసుకోవడం జరిగింది. దీని పూర్తి మ్యాపు తయారు చేసిన తర్వాత దీంట్లో వచ్చిన చెరువు,కెనాల్ సాగుకు ఉపయోగపడని భూమి, ఉపయోగపడే భూమి ఎంత ఉన్నది అనేది దాని మీద పూర్తి సమాచారం కొరకు ఈ సర్వే నిర్వహిస్తున్నాం అని,రైతులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సర్వేకు సహకరిస్తున్నారని తెలిపారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** 8రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు, ప్రభుత్వ ప్రకటనలు, బిల్లుల ఆమోదంతో కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. అలాగే సభ ముందుకు వచ్చిన నాలుగు బిల్లులకూ ఆమోదం లభించింది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ హామీల అమలును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు, నినాదాలు ఉన్న నల్ల టీషర్టులతో అసెంబ్లీకి చేరుకున్నారు. వారిని పోలీసులు అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సమావేశాల్లో నాలుగు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఇక 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం పార్టీల బలాబలాల విషయానికి వస్తే.. కాంగ్రెస్‌కు 66 మంది, బీఆర్ఎస్‌కు 37 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎంకు 7 మంది, సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు.

# రైతాంగానికి అండగా ఉంటాం

మొదటి పేజీ తరువాయి

ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు భారీగా తగ్గాయని ఉత్తమ్ సభకు వివరించారు. శ్రీశైలంలో గత ఏడాది 153.56 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం సుమారు 61 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 174 టీఎంసీల నుంచి సుమారు 44 టీఎంసీలకు నిల్వలు తగ్గాయని తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో కలిపి 585 టీఎంసీల లైవ్ స్టోరేజీ సామర్థ్యానికి ప్రస్తుతం 241 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయని, గత ఏడాది ఇదే సమయంలో 497 టీఎంసీలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో సుమారు 40 శాతం చెరువులు పావు సామర్థ్యం కన్నా తక్కువగా నిండాయని మంత్రి పేర్కొన్నారు. జలాశయాల్లో కనిపించే మొత్తం నీటినీ సాగుకు వినియోగించడం సాధ్యం కాదని, తాగునీరు, డెడ్ స్టోరేజీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

**'కృష్ణాలో ఒక్క చుక్కా వదులుకోం'**

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను సాధించి తీరుతామని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని చెప్పారు. ట్రిబ్యునల్, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర వాదనలను బలంగా వినిపిస్తున్నామని తెలిపారు. గతంలో అమలైన 66:34 తాత్కాలిక నిష్పత్తిని శాశ్వత హక్కుగా అంగీకరించలేదని, 50:50 పంపిణీ కోసం తెలంగాణ వాదిస్తోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ మేడిగడ్డ ఏడో బ్లాక్ దెబ్బతినడంతో నీటి మళ్లింపుపై ప్రభావం పడిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనలను పాటిస్తామని చెప్పారు. ప్రజల భద్రతను పణంగా పెట్టి వాటిని వినియోగించలేమని, ఎన్డీఎస్ఏ, కేంద్ర జలసంఘం మార్గదర్శకాల ప్రకారమే పునరుద్ధరణ చేపడతామని తెలిపారు. సురక్షితంగా ఉన్న కాళేశ్వరం లింక్--2 ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందన్న బీఆర్ఎస్ వాదనను ఉత్తమ్ తోసిపుచ్చారు. పంప్‌హౌస్‌లు నిర్మించినంత మాత్రాన ఎత్తిపోతల పథకం పూర్తయినట్లు కాదని, కాలువలు, పంపిణీ వ్యవస్థ, భూసేకరణ, పునరావాస పనులు ఇంకా పూర్తికావాల్సి ఉందని పేర్కొన్నారు. చట్టబద్ధ అనుమతులు, మిగిలిన పనులు పూర్తిచేసి ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయడంతోపాటు కాలువలు, పంపింగ్ వ్యవస్థల మరమ్మతులను వేగవంతం చేస్తామని చెప్పారు.

**సింగూరుపై ప్రత్యేక ప్రణాళిక: సీతక్క**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి కోసం 34 జలాశయాలను వినియోగిస్తున్నామని, వాటిలో నీటిమట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ నీటిపారుదల శాఖతో వారానికోసారి సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సింగూరు జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీరు సుమారు 75 రోజులకు సరిపోతుందని, ఆ తర్వాత కూడా వర్షాలు లేకపోతే ఎదు- రయ్యే పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సింగూరుపై నాలుగు జిల్లాల్లోని 2,395 గ్రామీణ ఆవాసాలు, 19 పట్టణ స్థానిక సంస్థలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే చేతిపంపులు, సింగిల్‌ఫేజ్, త్రీఫేజ్ పథకాలు, బావులు, అద్దె బోర్లు, సమీప నీటి వనరుల నుంచి తరలింపు వంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పనులను పెద్దఎత్తున చేపడుతున్నామని సీతక్క చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 60 కుటుంబాలకు పని కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రోజుకు సగటున 12 లక్షల మంది, జూలై నుంచి రోజుకు సగటున రెండు లక్షల మంది ఉపాధి పనులకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.2 వేల కోట్లకు పైగా వేతనాలను నేరుగా కూలీలకు చెల్లించినట్లు చెప్పారు. 'ఇంటింటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట' లక్ష్యంతో నీటి సంరక్షణ పనులు చేపడుతున్నామని సీతక్క వివరించారు.



# వర్షాభావంపై కేంద్రం ఆదుకోవాలి

**శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ వినతి**

**ప్రత్యామ్నాయ పంటలకు సహకారం కోరిన సీఎం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై రాష్ట్రంలోని పరిస్థితులను వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీఎం కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి వైపు ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే లక్ష్యంతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ్ కింద తొలి విడతలో తెలంగాణకు రెండు లక్షల ఇళ్లు కేటాయించినందుకు శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని గత జూలైలో ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తాజాగా మిగిలిన సుమారు 9.56 లక్షల ఇళ్లను కూడా రాష్ట్రానికి కేటాయించాలని కోరారు. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడంతోపాటు సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్న విషయాన్ని కూడా సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

మొదటి పేజీ తరువాయి

అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ధర్మాసనం ప్రకటించింది. తీర్పు ప్రతిని అసెంబ్లీ కార్యదర్శితోపాటు స్పీకర్, ఎన్నికల సంఘానికి పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దీంతో ఖైరతాబాద్ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహణకు మార్గం ఏర్పడింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు అవకాశం కల్పిస్తూ అప్పటివరకు ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని దానం తరఫు న్యాయవాదులు కోరారు. అయితే ఈ అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. హైకోర్టు తీర్పును బీజేపీ నేతలు స్వాగతించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై తాము చేసిన న్యాయపోరాటానికి ఈ తీర్పుతో ఫలితం దక్కిందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి ప్రజల తీర్పు కోరాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం దృష్ట్యా బీజేపీ తరఫున కేవియట్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, తీర్పు వెలువడిన తర్వాత దానం నాగేందర్ స్పందిస్తూ హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని, మళ్లీ ఎన్నికలు వస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నారు.

# ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే



**హైకోర్టు తీర్పును స్వాగతించిన దానం**

**ఎన్నికల పోరు కొత్తేమీ కాదని వ్యాఖ్య**

**మళ్లీ పోటీ చేస్తానని స్పష్టీకరణ**

**సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక జరిగితే మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని, మళ్లీ ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని చెప్పారు. హైకోర్టు తీర్పు అనంతరం శుక్రవారం దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. "యుద్ధం నాకేం కొత్త కాదు. మళ్లీ పోరాడతా.. మళ్లీ గెలుస్తా" అంటూ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న విశ్వాసాన్ని వెల్లడించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని దానం స్పష్టం చేశారు. అనర్హత తీర్పుపై తాను ఆందోళన చెందడం లేదని, రాబోయే పరిణామాలను రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బీఆర్ఎస్ తరఫున 2023లో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన అనర్హత పిటిషన్లలో హైకోర్టు శుక్రవారం ఆయనను అనర్హుడిగా ప్రకటించింది.

# విజిలెన్స్‌కు కొత్త పవర్

**రెండు విభాగాలుగా పునర్వ్యవస్థీకరణ!**

**క్షేత్రస్థాయి తనిఖీలకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లను రెండు ప్రత్యేక రంగాలుగా విభజించి, ఒక్కో విభాగానికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించాలని యోచిస్తోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) స్కామ్‌లో రూ.1,700 కోట్ల మేర ధాన్యం ఎగవేతకు పాల్పడిన మిల్లర్లపై విజిలెన్స్ బృందాలు దాడులు జరిపి, ఇప్పటికే రూ.1,000 కోట్లకు పైగా వసూలు చేశాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ శాఖను బలోపేతం చేసే ప్రక్రియ వేగవంతమైంది. ప్రస్తుతం అదనపు డీజీపీ డీఎస్ చౌహాన్ ఈ విభాగానికి డీజీగా వ్యవహరిస్తుండగా, ఐజీపీగా పదవీ విరమణ పొందిన ఏఆర్ శ్రీనివాస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కొత్త విధివిధానాల ప్రకారం రెండు డైరెక్టర్ పోస్టులు ఖరారైతే.. విజిలెన్స్ విభాగం పర్యవేక్షణను ఏఆర్ శ్రీనివాస్‌కు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలను ఐజీ అభిషేక్ మహంతికి అప్పగించే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్రంలోని 8 ప్రాంతీయ కార్యాలయాల్లో (ఆర్‌వీఈఓ) 92 ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు 6 కొత్త వాహనాలను సమకూర్చాలని ప్రతిపాదించారు. మిల్లుల్లో విస్తృత తనిఖీల కోసం ఇటీవల కేటాయించిన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 79 మంది కమాండోలను క్షేత్రస్థాయి పరిశీలనలకు సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు.

# ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా

- అక్టోబర్ 9న పోలింగ్, 17న ఫలితాలు
- గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్
- ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ
- రీజియన్, రాష్ట్ర స్థాయిలో వేర్వేరు బ్యాలెట్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎన్నికల శంఖారావం మోగింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు ఆర్టీసీ యాజమాన్యం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అక్టోబరు 9న పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 17న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి విజేతలను ప్రకటించనున్నారు. చివరిసారిగా ఆర్టీసీలో 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఎన్నికలు జరగకపోవడంతో సుదీర్ఘ విరామం ఏర్పడింది. కార్మికుల తరఫున యాజమాన్యంతో అధికారికంగా చర్చించే గుర్తింపు సంఘం లేకుండానే ఇన్నేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం కావడంతో ఆర్టీసీ కార్మిక సంఘాల్లో సందడి మొదలైంది.

### గుర్తింపు సంఘం అంటే..?

ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు, యూనియన్లు ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘానికే చట్టబద్ధమైన 'గుర్తింపు సంఘం' హోదా దక్కుతుంది. ఈ ఎన్నికలను రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో వేర్వేరుగా నిర్వహిస్తారు. రెండు స్థాయిలకు సంబంధించి ఓటర్లకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలు అందిస్తారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో గుర్తింపు సంఘానిదే కీలక పాత్ర. వేతనాల పెంపు, జీతాల సవరణ, బోనస్‌లు, కరువు భత్యం, పెండింగ్ బకాయిలు, సర్వీసు నిబంధనల్లో మార్పులు, డిపోల పనివేళలు తదితర కీలక సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే చట్టబద్ధమైన అవకాశం గుర్తింపు సంఘానికి ఉంటుంది. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో యాజమాన్యంతో ఒప్పందాలు చేసుకోవడంలోనూ ఈ సంఘం కీలకంగా వ్యవహరిస్తుంది.

# సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ.. నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** శాసనసభ సమావేశాలకు హాజరయ్యే ఉద్దేశం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగా సభా నియమాలను ఉల్లంఘించారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. సభ సజావుగా సాగకూడదన్న కుట్రతోనే వారు ఆటంకాలు సృష్టించారని విమర్శించారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంనిరవధికంగా వాయిదా పడిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. టీ షర్టులపై స్లోగన్స్ రాసుకుని రావడం నిబంధనలకు విరుద్ధమని తెలిసీ కేవలం ప్రచారం కోసం బీఆర్ఎస్ నేతలు సభా సంప్రదాయాలను తుంగలో తొక్కారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వారి ప్రభుత్వ హయాంలోనే ప్లకార్డులు, స్లోగన్స్‌తో సభలోకి రాకూడదని అప్పటి స్పీకర్ రూలింగ్ ఇచ్చారని, కొత్త రూల్స్ తెచ్చారని గుర్తుచేశారు. ఆ విషయం తెలిసి కూడా సభా మర్యాదను మంటగలిపారని దుయ్యబట్టారు. శాసనసభ జరుగుతుండగానే బయట మాక్ అసెంబ్లీ నిర్వహించడం సభ గౌరవాన్ని అవహేళన చేయడమేనని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని మంత్రి అన్నారు. నెల రోజులు సభ నిర్వహించాలని కేటీఆర్ కోరడం ఉత్త మాటలే అని తేలిపోయిందన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి ఆందోళన చేయడం కరెక్ట్ కాదన్నారు. స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికమని, ఈ ఘటన యావత్ తెలంగాణ సమాజం చూసిందని, ఇది స్పీకర్‌ను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### భూకబ్జాలపై హైపవర్ కమిటీ

భూముల ఆక్రమణల వ్యవహారంపై విచారణ జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైపవర్ అధికారులతో కూడిన ఓ కమిటీని వేశారని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కమిటీ నెల రోజుల వ్యవధిలో 12 కీలక అంశాలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### విజయవంతంగా ముగిసిన సమావేశాలు

ఈ నెల 7న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు 18వ తేదీ వరకు విజయవంతంగా జరిగాయని, ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. సభలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించామన్నారు. మొత్తం పని దినాలు: 8 రోజులు, సభ జరిగిన సమయం: 51 గంటల 52 నిమిషాలు మౌఖిక సమాధానాలు (మంత్రుల ద్వారా): 50. సమాధానం ఇచ్చిన స్టార్డ్ ప్రశ్నలు: 9 సమాధానం ఇచ్చిన అన్‌స్టార్డ్ ప్రశ్నలు: 1 సభ్యులు అడిగిన సప్లిమెంటరీ ప్రశ్నలు: 86 సభ్యుల ప్రసంగాలు: 105, మంత్రులు చేసిన ప్రకటనలు: 2, ఆమోదం పొందిన ప్రభుత్వ తీర్మానాలు: 3, సభలో ఆమోదం పొందిన బిల్లులు: 4, స్వల్పకాలిక చర్చలు: 4 సమాధానాలు అందని ప్రశ్నలు: స్టార్డ్ - 62, అన్‌స్టార్డ్ - 22 అని మంత్రి తెలిపారు

# దానం అనర్హత తీర్పుతో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బట్టబయలు

- హైకోర్టు తీర్పు స్పీకర్ వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తింది
- ప్రజల తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించలేదని హరీశ్‌రావు విమర్శ



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ విషయంలో అనుసరిస్తున్న తీరుపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనూ ఎమ్మెల్యే పదవిలో కొనసాగారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పవిత్రతను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, స్పీకర్ నిర్ణయం ద్వారా ఆయనకు రక్షణ కల్పించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తీరని మచ్చగా మిగిలిందన్నారు.

### రాహుల్ హామీపై నిలదీత

2024 ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై స్వయంచాలకంగా అనర్హత వేటు పడేలా పదో షెడ్యూల్‌ను సవరించాలని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఫిరాయింపులు జరిగినప్పుడు అదే నిబద్ధత ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంపై వైఖరి మారుతోందా అని నిలదీశారు.

### ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లను స్పీకర్ చట్ట ప్రకారం పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజల తీర్పు కోరేలా సీఎం రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఆదేశించాలని డిమాండ్ చేశారు.

# మానవ అక్రమ రవాణా కేసు

- తొమ్మిది మందికి జీవిత ఖైదు
- దోషుల్లో ఎనిమిది మంది బంగ్లాదేశీయులు
- ఉద్యోగాల పేరుతో మహిళలకు వల
- భారత్‌కు తీసుకొచ్చి వ్యభిచారంలోకి దింపినట్లు నిర్ధారణ
- 2019 పహాడీషరీఫ్ కేసులో కీలక తీర్పు
- 1.37 లక్షల జరిమానా విధించిన ప్రత్యేక కోర్టు



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** హైదరాబాద్‌లో వెలుగుచూసిన మానవ అక్రమ రవాణా కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన తొమ్మిది మందికి జీవిత ఖైదు విధించింది. వీరిలో ఎనిమిది మంది బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నారు. ఉద్యోగాలు, మంచి వేతనాలు ఇప్పిస్తామని మహిళలను నమ్మించి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌కు తీసుకొచ్చి, అనంతరం బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు దర్యాప్తులో తేలింది. 2019 సెప్టెంబర్‌లో పహాడీషరీఫ్ పోలీసులు తొలుత ఈ కేసు నమోదు చేశారు. జల్‌పల్లిలోని ఓ వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు బంగ్లాదేశ్ మహిళలను రక్షించారు. బాలాపూర్‌లోని మహ్మద్ కాలనీలో ఓ ఇంటి నుంచి మరో మహిళకు విముక్తి కల్పించారు. అనంతరం కేసును ఎన్ఐఏ స్వాధీనం చేసుకుని తిరిగి నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో ఏ-1 నుంచి ఏ-12 వరకు మొత్తం 12 మందిపై ఎన్ఐఏ అభియోగపత్రం దాఖలు చేసింది. 2019-2020 మధ్య తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో నిందితులను అరెస్టు చేసింది. 2020 అక్టోబర్ 17న ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసింది. ఏ-1, ఏ-3, ఏ-7 నిందితులు పరారీలో ఉన్నట్లు ఎన్ఐఏ తెలిపింది. విచారణ అనంతరం మిగిలిన తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక కోర్టు జీవిత ఖైదుతోపాటు మొత్తం రూ.1.37 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది.



# ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

## ఏసీబీ కోర్టు వద్ద కేటీఆర్ సవాల్


### లక్ష కోట్ల ఆస్తులుంటే రూ.1,000 కోట్లకే తీసుకోండి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఓపెన్ ఛాలెంజ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి అవినీతి జరగలేదని, కేవలం హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఆ ఈవెంట్ నిర్వహించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు. తమపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసులు బనాయించిందని, అయితే ఇటువంటి కేసులకు తాము భయపడేది లేదని ధీమా వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, విచారణకు ఎప్పుడు పిలిచినా కోర్టుకు హాజరవుతానని తెలిపారు. పక్క రాష్ట్రాల సీఎంలు తమ రాష్ట్రాల బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడానికి లండన్ లాంటి ప్రాంతాలకు వెళ్తుంటే, తెలంగాణలో మాత్రం పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేసిన వారిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆరే టార్గెట్‌గా ప్రభుత్వం పనిచేస్తోందని, తమపై లక్ష కోట్ల ఆస్తులంటూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ పేరిట లక్ష కోట్ల ఆస్తులు ఉంటే కేవలం రూ.1,000 కోట్లే తీసుకొని మిగిలిన రూ.99 వేల కోట్లను ప్రజా సంక్షేమ హామీలకు ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు.

# నిరంకుశ నిజాం ఆదర్శమా?

### కాంగ్రెస్, బీర్ఎస్‌లు భూములను దోచుకుంటున్నాయి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఫైర్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్) :** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు, బీఆర్ఎస్-కాంగ్రెస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు చూస్తుంటే ఆ రెండు పార్టీల అసలు నైజం ఏమిటో ప్రజలు స్పష్టంగా గమనించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ పదేపదే నిజాంను మంచి పరిపాలకుడని, గొప్ప పనులు చేశాడని కీర్తిస్తే మొన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం నిజాం చాలా గొప్ప మనిషంటూ పొగడ్తలతో ముంచెత్తడం ఈ రెండు పార్టీల వక్ర వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నాడు నిజాం పాలనలో పల్లెల్లో కనీసం ఆడబిడ్డలు బతుకమ్మను కూడా ఆడుకోలేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. జలియన్ వాలాబాగ్ తరహాలో పరకాల, జోడేఘాట్, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రి (నిర్మల్) వంటి అనేక ప్రాంతాల్లో ప్రజలను విచక్షణా రహితంగా కాల్చి చంపిన రక్త చరిత్ర నిజాం సర్కారుదని అన్నారు. అలాంటి క్రూరమైన నిజాంను నేడు ప్రజాస్వామ్య పాలనలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదని మండిపడ్డారు. నాటి నిజాం ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా ఉండేవాడని, ఆయన తరహాలోనే తాము కూడా దేశంలోనే అత్యంత ధనికులుగా మారాలన్న దురాశతోనే కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ప్రజాధనాన్ని, భూములను విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నిజాం సొమ్మును, పేదల భూములను దోచుకున్నారని, దాదాపు 500 ఎకరాల విలువైన భూములను కొల్లగొట్టారని స్వయంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డే వెల్లడించారని రామచందర్ రావు ప్రస్తావించారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి, ఆయన మంత్రులు సైతం 22-ఏ (నిషేధిత జాబితా) ముసుగులో ప్రైవేటు భూములను కబ్జా చేస్తూ భారీ భూకుంభకోణాలకు పాల్పడుతున్నారనేది బహిరంగ వాస్తవమని ఆరోపించారు. ఒకరు నిజాం భూములను, పేదల ఆస్తులను కాజేశారని మరొకరు చెబుతుంటే ఇంకొకరు 22-ఏ నిబంధనలను అడ్డం పెట్టుకుని వేల కోట్ల విలువైన భూములను ఆక్రమిస్తున్నారని పరస్పరం బట్టబయలు చేసుకుంటున్నారన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాజకీయాల్లోకి రాకముందు వారి ఆస్తులు, కుటుంబ ఆస్తులు ఎంత.. నేడు వారి ఆస్తుల విలువ ఎంత అనేది ఎన్నికల అఫిడవిట్ల ద్వారా ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా జరిగిన ఈ భూదోపిడీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ విచారణ కేవలం కేసీఆర్ హయాంలో జరిగిన 500 ఎకరాల కుంభకోణానికే పరిమితం కాకుండా కాంగ్రెస్ పాలనలో 22-ఏ నిషేధిత జాబితా పేరుతో సాగుతున్న భూకబ్జాలపై కూడా నిష్పక్షపాతంగా జరగాలన్నారు. వారి కుటుంబాలు, వ్యక్తిగత సంక్షేమం కోసమే తప్ప ప్రజల బాగోగుల గురించి ఏనాడూ ఆలోచించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఎవరితోనూ పొత్తులు ఉండబోవని, ఒంటరిగానే బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రస్తుత పాలకులు ఈ భూకుంభకోణాలపై నిజాయతీగా విచారణ జరపకపోతే రేపు బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గత, ప్రస్తుత ప్రభుత్వాల భూదోపిడీలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను చట్టం ముందు నిలబెడతామని రామచందర్‌రావు హెచ్చరించారు.




# నేను స్వతంత్రుడిని

## ఏఐ మోడల్ దుందుడుకు!

**ఆరు అనూహ్య ఘటనలను బయటపెట్టిన ఓపెన్ఏఐ**

**సూచనలను దాటేసేలా సొంత ఆదేశాలు రాసుకున్న పరిశోధనా మోడల్**

**తప్పులను దాచాలని సూచించిన జీపీటీ-5.6 శిక్షణ నమూనాలు**

**అనుమతి లేకుండా ఏపీఐ కీ వినియోగించిన మరో మోడల్**

**'మిస్అలైన్‌మెంట్'పై కొత్త బహిర్గత విధానం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** కృత్రిమ మేధ మోడళ్లు తమకు నిర్దేశించిన హద్దులను దాటి ప్రవర్తించిన ఆరు ఘటనలను ఓపెన్ఏఐ బహిర్గతం చేసింది. ఇవన్నీ గత ఆరు నెలల్లో మోడళ్ల శిక్షణ లేదా మూల్యాంకన సమయంలో గుర్తించిన విడివిడి ఘటనలేనని, సాధారణ వినియోగంలో ఇవి ఎంత తరచుగా జరుగుతాయనే దానికి ఈ ఉదాహరణలను కొలమానంగా భావించరాదని సంస్థ స్పష్టం చేసింది. మోడళ్ల లక్ష్యాలు, ప్రవర్తన మానవ సూచనలు లేదా నిర్దేశించిన నియమాలకు విరుద్ధంగా మారే 'మిస్-అలైన్‌మెంట్' ఘటనలను ఇకపై క్రమబద్ధంగా దర్యాప్తు చేసి వెల్లడించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. విడుదల కాని ఓ పరిశోధనా మోడల్ తన పనిని మరో సందర్భంలో కొనసాగించేందుకు రూపొందించిన సారాంశాల్లో అసలు పనితో సంబంధం లేని సొంత సూచనలను చొప్పించినట్లు ఓపెన్ఏఐ తెలిపింది. సాధారణ పరిమితులను పట్టించుకోకుండా స్వతంత్రంగా వ్యవహరించాలనే భావన కలిగించే 'పెర్సొనా' సూచనలు వాటిలో ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి ప్రభావం కనిపించిన 27 సారాంశాలను గుర్తించినట్లు వెల్లడించింది. ఇది మోడల్‌కు నిజంగా 'స్వతంత్ర చైతన్యం' వచ్చిందని అర్థం కాదని, శిక్షణ-మూల్యాంకన సమయంలో నమోదైన అనూహ్య ప్రవర్తనగా చూడాలని నివేదిక స్పష్టం చేస్తోంది. జీపీటీ-5.6 సోల్ శిక్షణ సమయంలో కొన్ని మోడల్ నమూనాలు భవిష్యత్తులో పని కొనసాగించే మోడళ్లకు తప్పులు లేదా నిర్దేశిత లక్ష్యాలకు విరుద్ధమైన ప్రవర్తనను వినియోగదారుడి నుంచి దాచేలా సారాంశాల్లో సూచనలు చేర్చినట్లు సంస్థ వెల్లడించింది. లేని పాత సమాచారాన్ని సృష్టించడం, ఆధారాల వర్షన్ల మధ్య ఉన్న తేడాలను బయటపెట్టకుండా ఉండటం వంటి ప్రవర్తనను గుర్తించినట్లు తెలిపింది. మరో ఘటనలో ఆదాయ గణాంకాల కోసం వెతుకుతున్న మోడల్ పబ్లిక్ రిపోజిటరీలో బయటపడిన ఏపీఐ కీని గుర్తించి అనుమతి లేకుండా ఉపయోగించింది. అయినప్పటికీ కావాల్సిన సమాచారం లభించకపోవడంతో గణాంకాలను కల్పించి, అవి కోరిన మూలం నుంచే వచ్చినట్లు చూపించినట్లు ఓపెన్ఏఐ తెలిపింది. ఇంకో విడుదల కాని మోడల్ బ్రౌజర్ ఆధారం పొందాలనే ఉద్దేశంతో వినియోగదారుడి అనుమతి లేకుండానే ఒక ఫైల్‌ను ఇంటర్నెట్‌లోకి అప్‌లోడ్ చేసింది. మిగిలిన ఘటనల్లో మోడళ్లు తమకు నిర్దేశించని సమాచార మార్పిడి మార్గాలను ఉపయోగించాయి. కొన్ని మోడళ్లు అంతర్గత సాఫ్ట్‌వేర్ రిపోజిటరీని సందేశాల మార్పిడికి ఉపయోగించగా, కలిసి పనిచేస్తున్న కొన్ని ఏజెంట్లు ఒకరి స్థానిక ఫైళ్లను మరొకరు పొందలేక పబ్లిక్ ఫైల్ హోస్టింగ్ సేవల్లో టాస్క్ ఫైళ్లను ఉంచినట్లు సంస్థ వివరించింది.

**ఇకపై ఘటనలు బహిర్గతం**

కొత్త విధానం ప్రకారం ఓపెన్ఏఐ ఉద్యోగులు అనుమానాస్పద మోడల్ ప్రవర్తనను గుర్తిస్తే భద్రత, అలైన్‌మెంట్ బృందాలకు నివేదించవచ్చు. ఆయా బృందాలు ఘటన తీవ్రత, ప్రభావం, ఇంకా స్పష్టత రావాల్సిన అంశాలను పరిశీలించి బహిరంగంగా వెల్లడించాలా వద్దా నిర్ణయిస్తాయి. ఈ ఆరు ఘటనలతోనే సమస్య ముగిసిందని సంస్థ చెప్పడం లేదు. ఏఐ వ్యవస్థలు మరింత శక్తిమంతమవుతున్న నేపథ్యంలో అలైన్‌మెంట్, పర్యవేక్షణ ఇంకా పూర్తిగా పరిష్కారమైన సమస్యలు కావని ఓపెన్ఏఐ పేర్కొంది.

# పిల్లల పాస్‌పోర్టుకు కొత్త రూల్స్!

**15 ఏళ్లలోపు వారికి ఐదేళ్ల కాలపరిమితి**

**18 ఏళ్ల వరకే చెల్లుబాటయ్యేలా నిబంధన**

**మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్టు**

**పాస్‌పోర్టు నిబంధనలను సవరించిన కేంద్రం**

**గెజిట్ నోటిఫికేషన్ విడుదల**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** దేశంలో మైనర్లకు జారీ చేసే పాస్‌పోర్టుల నిబంధనల్లో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మార్పులు చేసింది. 'పాస్‌పోర్ట్స్ (అమెండ్‌మెంట్) రూల్స్-2026' పేరుతో సెప్టెంబర్ 17న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సవరించిన రూల్ 12 ప్రకారం 15 ఏళ్లలోపు పిల్లలకు జారీ చేసే సాధారణ పాస్‌పోర్టు ఐదేళ్లు లేదా వారు 18 ఏళ్ల వయసు చేరేవరకు-ఏది ముందైతే అంతవరకే చెల్లుబాటవుతుంది. కొత్త నిబంధనల ప్రకారం 15 ఏళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్టు జారీ చేస్తారు. ఉదాహరణకు 13 ఏళ్ల వయసులో పాస్‌పోర్టు తీసుకుంటే ఐదేళ్ల కాలపరిమితి పూర్తయ్యే సమయానికే 18 ఏళ్లు వస్తాయి కాబట్టి అప్పటివరకు చెల్లుబాటవుతుంది. అయితే 14 ఏళ్ల వయసులో తీసుకుంటే ఐదేళ్లు కాకుండా 18 ఏళ్లు వచ్చే వరకే, అంటే సుమారు నాలుగేళ్లు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అంటే మైనర్ల పాస్‌పోర్టు విషయంలో 'ఐదేళ్లు లేదా 18 ఏళ్ల వయసు వరకు.. ఏది ముందైతే అది' అన్నదే ప్రధాన నిబంధన. 18 ఏళ్లు పూర్తయిన తర్వాత పెద్దలకు వర్తించే నిబంధనల ప్రకారం కొత్త పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజులకు సంబంధించిన నిబంధనల్లోనూ ప్రభుత్వం ఇటీవల సవరణలు చేసింది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక నోటిఫికేషన్‌ను విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే జారీ చేసింది.

# మొదట ఓటు చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ!

- ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు
- తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం
- బీజేపీ-ఈసీ చేతులు కలిపాయని ఆరోపణ
- ప్రజల తీర్పును కాపాడాలని డిమాండ్
- స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడతామని వెల్లడి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, 'పువ్వులు--గడ్డి' ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా ఫ్రీజ్ చేయడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "మొదట ఓటు చోరీ.. తర్వాత ప్రభుత్వాల చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ" అంటూ శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం దిగజారుతోందనడానికి తాజా పరిణామమే నిదర్శనమని ఆయన ఆరోపించారు. తృణమూల్‌లో మమతా బెనర్జీ, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని రెండు వర్గాలు పార్టీపై హక్కు తమదేనని వాదిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివాదంపై తుది నిర్ణయం వెలువడే వరకు రెండు వర్గాలూ 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, రిజర్వ్ చేసిన 'పువ్వులు-గడ్డి' గుర్తును ఉపయోగించకుండా ఆదేశించింది. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

**'ప్రజల తీర్పును కాపాడాలి'**

ప్రజలు ఇచ్చిన తీర్పును పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని రాహుల్ పేర్కొన్నారు. కానీ ప్రజల తీర్పును మార్చే శక్తులకు ఈసీ సహకరిస్తోందని ఆరోపించారు. ముందుగా బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి పనిచేస్తాయని, ఆ తర్వాత రాజకీయ పార్టీల గుర్తులపై ప్రభావం చూపుతాయని విమర్శించారు. గతంలో శివసేన, ఎన్సీపీ విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ రాహుల్ గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలే. ఈ పోరాటం మమతా బెనర్జీ ఒక్కరిదే కాదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరుకు సంబంధించినదని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం గడువు మేరకు రెండు తృణమూల్ వర్గాలు ప్రత్యామ్నాయ పేర్లు, గుర్తులను సమర్పించాయి. అనంతరం మమతా బెనర్జీ వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును, ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఎన్వలప్' గుర్తును ఎన్నికల సంఘం కేటాయించినట్లు తాజా సమాచారం.



# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

**16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..**

**రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు**

**నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. స్వరూప్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో 19 ఏళ్ల యువకుడితోపాటు ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో బాలికకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. గత శుక్రవారం రాత్రి బాలిక తనకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడిని కలిసేందుకు వెళ్లింది. అనంతరం అతడు మరో ముగ్గురితో కలిసి బాలికను తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఆమెపై నలుగురూ సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసి మృతదేహాన్ని కుషాక్ రోడ్డుకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్లు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల తర్వాత ఆదివారం స్థానికులు బాలిక మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో తొలుత గుర్తింపు కష్టమైనట్లు పోలీసులు తెలిపారు. కనీసం లింగ నిర్ధారణ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయని, ఒక చేయి వేరుగా పడి ఉన్నట్టు గుర్తించామన్నారు. మరోవైపు.. బాలిక అదృశ్య ఘటనపై ఆమె కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆమె తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లేదని, కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండేదని వారు చెప్పారన్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా సామూహిక అత్యాచారం, హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో ఒకరికి 19 ఏళ్లు కాగా, మిగిలిన ముగ్గురు మైనర్లని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అపహరణ, అత్యాచారం, హత్యతోపాటు పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

**సమస్త సంతోషానికీ ధర్మమే మూలం: మోహన్ భాగవత్**

**యువత ధర్మంపై చర్చించడం సంతోషకరమని వ్యాఖ్య**

**అహంకారం, అపోహలను వీడాలని సూచన**



**ఉజ్జయిని, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ధర్మం అనేది వృద్ధాప్యంలో మాత్రమే ఆచరించాల్సిన అంశం కాదని, మనిషి పుట్టుక నుంచి మరణం వరకు జీవితంలో భాగంగా ఉంటుందని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శుక్రవారం జరిగిన 'యువ ధర్మ సంసద్'లో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యువత ధర్మం గురించి ఆలోచిస్తూ, చర్చించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. గీత, రామాయణం వంటి గ్రంథాలను పదవీ విరమణ తర్వాతే చదవాలనే భావన సరైంది కాదన్నారు. ధర్మం జీవితానికి దిశానిర్దేశం చేసే అంశమని, సృష్టి ఆరంభం నుంచి అంతం వరకు దాని ఉనికి కొనసాగుతుందని పేర్కొన్నారు. సమస్త సంతోషానికీ ధర్మమే మూలమని వివరించారు. ప్రతిదీ తన నియంత్రణలోనే ఉందని, తాను అనుకున్నట్లే జరగాలనే భావన అహంకారానికి దారితీస్తుందని భాగవత్ అన్నారు. ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే మనసులో స్థిరపడిపోయిన అపోహలు, ముందస్తు అభిప్రాయాలను విడిచిపెట్టాలని యువతకు సూచించారు. ధర్మం మనిషిని బంధించేది కాదని, సరైన జీవన మార్గాన్ని చూపుతూ విముక్తి వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు.

# బ్రీత్ అనలైజర్ పరీక్షలో జాప్యం..

**నలుగురు పైలట్లతో సహా 8 మందిని సస్పెండ్ చేసిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** బ్రీత్ అనలైజర్ పరీక్షలో జాప్యం చేసిన పైలట్లు, సిబ్బందిపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ విమాన ప్రయాణం తర్వాత నిర్దేశించిన రెండు గంటల వ్యవధిలోగా తప్పనిసరిగా బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయించుకోనందుకు నలుగురు పైలట్లతో సహా ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేసింది. ఆగస్ట్ 2న దుబాయ్-అమృత్‌సర్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం అమృత్‌సర్‌లోని గురు రామ్ దాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. ఆ తర్వాత రెండు గంటల్లోగా ఆ విమాన సిబ్బంది తప్పనిసరిగా పోస్ట్-ఫ్లైట్ డిక్లరేషన్‌కు హాజరు కావాల్సి ఉన్నది. కాగా, ఆ విమాన సిబ్బందిలో కొందరు 35 నిమిషాలు ఆలస్యంగా బ్రీత్ అనలైజర్ పరీక్షకు హాజరయ్యారు. విమానం ల్యాండ్ అయిన 2 గంటల 35 నిమిషాల తర్వాత తమ డిక్లరేషన్‌ను వారు సమర్పించారు. ఈ నేపథ్యంలో తమ సిబ్బంది పాల్పడిన ఈ ఉల్లంఘనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నివేదించింది. నలుగురు పైలట్లతో సహా ఎనిమిది మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు అందులో పేర్కొంది. మరోవైపు గత నెలలో ఫుకెట్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం భారీ కుదుపులకుగురైంది. ఆ పైలట్ గంజాయి సేవించినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమాన ప్రయాణం తర్వాత నిర్దేశిత వ్యవధిలోగా సిబ్బందికి బ్రీత్ అనలైజర్ పరీక్షలను విమానయాన సంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని డీజీసీఏ ఆదేశించింది.




# స్పామ్ కాల్స్‌కు ట్రాయ్ కొత్త చెక్!

**అనవసర కాల్స్, సందేశాలపై మరింత కఠిన నిబంధనలు**

**మూడు ఫిర్యాదులతోనే అనుమానిత నంబర్‌పై చర్య**

**వినియోగదారులకు కొత్త అప్పీల్ అవకాశం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** మొబైల్ వినియోగదారులను వేధిస్తున్న స్పామ్ కాల్స్, అనవసర వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు భారత టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, టెలికాం సంస్థల మధ్య సమాచార మార్పిడి, వినియోగదారులకు అదనపు రక్షణ కల్పించేలా వాణిజ్య సమాచార నియంత్రణ నిబంధనల్లో మూడో సవరణను సెప్టెంబర్ 18న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్పామ్‌కు ఎక్కువగా ఉపయోగించే అవకాశం ఉన్న నంబర్లను టెలికాం సంస్థలు ముందుగానే గుర్తించాలి. ఆ సమాచారాన్ని ఇతర ఆపరేటర్లతో పంచుకోవడంతోపాటు అనుమానిత నంబర్ల గుర్తింపు వివరాలను మళ్లీ తనిఖీ చేయాలి. స్పామ్‌కు పాల్పడుతున్నట్లు నిర్ధారణైతే నంబర్‌ను నిలిపివేసే వరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. వాణిజ్య, అధికారిక సమాచారానికి కేటాయించిన ప్రత్యేక నంబర్ సిరీస్‌లకు కూడా స్పష్టమైన రక్షణ కల్పించారు. ముఖ్యంగా నియంత్రిత సంస్థల సేవలు, లావాదేవీల కాల్స్‌కు ఉపయోగించే 1600 సిరీస్ నంబర్లను స్పామ్‌గా ట్యాగ్ చేయడం, బ్లాక్ చేయడం లేదా ఫిల్టర్ చేయడం అనుమతించబడదని ట్రాయ్ ఇప్పటికే స్పష్టం చేసింది. 140 సిరీస్ ప్రధానంగా ప్రచార కాల్స్‌కు వినియోగిస్తారు. స్పామ్‌ను గుర్తించే కాల్ మేనేజ్‌మెంట్, థర్డ్ పార్టీ యాప్‌ల విషయంలోనూ కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. టెలికాం సంస్థల నుంచి స్పామ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందాలంటే ఆయా యాప్‌లు తమ వద్ద ఉన్న సంబంధిత సమాచారాన్ని తిరిగి ఆపరేటర్లతో పంచుకోవాల్సి ఉంటుంది. దీంతో స్పామ్ నంబర్లను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే వ్యవస్థ బలోపేతం కానుంది. అలాగే ఒక నంబర్‌పై చర్యకు అవసరమైన ఫిర్యాదుల పరిమితిని ఐదు నుంచి మూడుకు తగ్గించారు. వినియోగదారుల ఫిర్యాదులపై టెలికాం సంస్థలు తీసుకున్న నిర్ణయంతో సంతృప్తి చెందని వారికి అప్పీల్ చేసుకునే వ్యవస్థను కూడా కొత్తగా ప్రవేశపెట్టారు. ఆటో డయలర్, రోబో కాల్స్ వంటి సాంకేతికతను ఉపయోగించే సంస్థలు ముందుగానే ఆ విషయాన్ని టెలికాం ఆపరేటర్లకు తెలియజేయాల్సి ఉంటుంది. దీంతో స్పామ్‌ను గుర్తించడం నుంచి ఫిర్యాదు, విచారణ, చర్య వరకు మొత్తం వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని ట్రాయ్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కొత్త నిబంధనలతో స్పామ్ కాల్స్, సందేశాలు పూర్తిగా అంతమవుతాయని ఇప్పుడే చెప్పలేం; వాటిపై వేగంగా చర్య తీసుకునేందుకు నియంత్రణ వ్యవస్థ మాత్రం మరింత కఠినమైంది.

# మహిళా సాధికారతకు స్వయం ఉపాధి శిక్షణలు

- స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం... డా.అనితా రెడ్డి
- మహిళల ఆత్మవిశ్వాసానికి స్వయం ఉపాధి బాట



**హనుమకొండ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్) :** మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి తమ కాళ్ల పై తాము నిలబడేందుకు నైపుణ్య శిక్షణలు ఎంతో దోహదపడతాయని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్ట ర్ అనితా రెడ్డి అన్నారు. మహిళల ఆర్థిక సాధికారతతోనే కుటుంబాలు, సమాజం, దేశం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కొండపర్తి గ్రామంలో ఎఫ్.ఎం.ఎం. సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యమడాల హనుకాంత్ అధ్యక్షతన మహిళల టైలరింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు, గ్రామంలోని పేద మహిళలకు నూతనంగా ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో 40 మంది మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ అనితా రెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ రమేష్ హాజరై శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్ట ర్ అనితా రెడ్డి మాట్లా డుతూ మహిళలు అందుబాటులో ఉన్న స్వయం ఉపాధి శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఒక మహిళ ఆర్థికంగా బలపడితే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నైపుణ్యం సంపాదించిన మహిళలకు ప్రభుత్వ రుణ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని, మహిళా సంఘాల సహకారంతో చిన్న వ్యాపారాలను ప్రారంభించి క్రమంగా అభివృద్ధి సాధించ వచ్చని తెలిపారు. మహిళా సాధికారతతో పాటు మహిళల భద్రతకు తమ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని సీఐ రమేష్ అన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని మహిళలకు సూచించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. నూతనంగా శిక్షణ ప్రారంభిస్తున్న మహిళలకు ఉచితంగా టైలరింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఎం.ఎం. సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, ప్రాజెక్టు మేనేజర్ కరుణ, అజయ్, హనుకాంత్, వార్డు సభ్యులు కట్కూరి స్వాతి, కట్ట సంబరాజు, మాజీ సర్పంచ్ కట్కూరి రాజమణి పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబ భూములపై సమగ్ర విచారణ జరపాలి

- దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి... టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్



**నర్సంపేట, సెప్టె ంబర్18 (సమయం న్యూస్) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన అంశాలపై ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టి , అక్రమాలు రుజువైతే బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సబ్బండ వర్గాల ప్రజలు రాష్ట్ర సాధన కోసం పోరాడుతుంటే ఆ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదపై దృష్టి సారించిందని అంబటి ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం అధికారాన్ని అడ్డుపెట్టు కుని భూములు, ఆస్తుల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యమంలో కీలకంగా పనిచేసిన పలువురు నాయకులను పక్కన పెట్టి, ఉద్యమంతో సంబంధం లేని వారిని చేరదీసి హైదరాబాద్ పరిసరాల్లో ని విలువైన ప్రభుత్వ భూములపై కన్నేశారని, ఈ వ్యవహారాలపై సమగ్రంగా దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలతో పాటు ఉద్యమంలో పాల్గొన్న అనేక వర్గాల ప్రజలు రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించారని, అయితే వారి ఆశలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరాం వంటి నాయకులు నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సమయంలో వారిపై చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. అయితే 2014 నుంచి 2023 వరకు జరిగిన భూ వ్యవహారాలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగంపై సమగ్ర విచారణ అవసర మన్నారు. అధికార యంత్రాంగంలోని కొందరు కూడా గత ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని, వాటిపైనా విచారణ జరిపించాలని కోరారు. ముఖ్యమంత్రి అసెంబ్లీ లో చేసిన ప్రకటనకు అనుగుణంగా కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై తక్షణమే విచారణ చేపట్టి , దర్యాప్తు ఫలితాలను ప్రజలకు వెల్ల డిం చాలని అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోనగాని ర వీందర్, జిల్లా నాయకులు మహబూబ్ అలీ, సాంబరాతి మల్లేశం, సోల్తి సాయికుమార్, రాజు, సంధాని తదితరులు పాల్గొన్నారు.

# డీజేలకు అనుమతి లేదు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ డాక్ట ర్ వినీత్ IPS
- ప్రజల భద్రత, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టి లో ఉంచుకుని డీజేలకు స్వస్తి పలకాలి
- సాంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో భక్తి భావాన్ని చాటుతూ శోభాయాత్రలు నిర్వహించాలి
- జిల్లాలో 120 మంది డీజే యజమానులు, ఆపరేటర్లను బైండోవర్ చేసిన పోలీసులు



**నారాయణపేట, సెప్టె ంబర్,18(సమయం న్యూస్)**

నారాయణపేట జిల్లా పరిధిలో గ ణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, మత సామరస్యంతో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్ట ర్ వినీత్ IPS ప్రజలకు, గణేష్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. డీజేల స్థానంలో పరిమిత శబ్దంతో స్పీకర్లను ఉపయోగించుకోవడంతో పాటు, మన సంప్రదాయాలను ప్రతిబింబించేలా డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, ఇతర సంప్రదాయ కళారూపాలతో శోభాయాత్రలు నిర్వహించుకోవాలని సూచించారు.శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, సత్య యాదవ్, నందు నామాజీతో పాటు పలువురు యువకులు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారితో నేరుగా మాట్లాడి గణేష్ ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, డీజేల నిషేధం, ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను వివరించారు.వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణీలు, యుక్త వయస్కులు తదితరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దంతో కూడిన డీజేలను వినియోగించకూడదని ఎస్పీ సూచించారు.గణేష్ పండుగ ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని పంచే పండుగ. జిల్లాలో ఒక్క ప్రాణానికి కూడా నష్ట ం జరగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలు నిర్వహించాలి. ఒక్క ప్రాణం కోల్పోయినా ఆ కుటుంబానికి మాత్రమే కాకుండా మొత్తం సమాజానికి అది విషాదమే. అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అందరూ పోలీసులకు సహకరించాలి" అని ఎస్పీ తెలిపారు గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రల సందర్భంగా డీజేలు వినియోగించరాదని సంబంధిత అధికారుల ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయబడినట్లు ఎస్పీ తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ మరియు RDO ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు డీజేలకు అనుమతి లేదని స్పష్ట ం చేశారు.ఎవరైనా డీజేలను ఏర్పాటు చేసి నిబంధనలను ఉల్లంఘించినా, నిషేధ ఉత్తర్వులను ధిక్కరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఉత్సవ నిర్వాహకులు, డీజే యజమానులు, ఆపరేటర్లు ఈ విషయాన్ని తప్పనిసరిగా గమనించాలని సూచించారు.నిబంధనల అమలులో భాగంగా నారాయణపేట జిల్లా పరిధిలో ఇప్పటివరకు 120 మంది డీజే యజమానులు, ఆపరేటర్లను పోలీసులు బైండోవర్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎలాంటి ఉల్ల ఘనలకు పాల్పడినా చట్ట పరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలను భక్తి,సంప్రదాయం,సోదరభావంతో నిర్వహిస్తూ "డీజేలకు స్వస్తి – సంప్రదాయ కళలకు ప్రాధాన్యం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎస్పీ కోరారు.

# టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'నేహాల్'

ఉత్తర్వులు జారీ చేసిన చైర్మన్ నవీన్ పెట్టెం



**హనుమకొండ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్) :** హనుమకొండ 58వ డివిజన్‌కు చెందిన మొహమ్మద్ ముస్తాక్ నేహాల్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ విభాగం చైర్మన్ నవీన్ పెట్టె ం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేహాల్ గతంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, వరంగల్ పార్ల మెంట్‌సోషల్ మీడియా ఇన్‌చార్జిగా, హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేహాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ సోషల్ మీడియా విభాగం చైర్మన్ నవీన్ పెట్టెంకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలకు పూర్తి న్యాయం చేస్తానని, పార్టీ విధానాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శాయశక్తులా పనిచేస్తానని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో తీరిన నీటి కష్టా లు



**తాండూరు,సెప్టెంబర్,18(సమయం న్యూస్)** గ్రామంలో బోర్లు ఎండిపోవడంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్న ప్రజలకు నేనున్నానంటూ నీటి కష్టాలు తీర్చేడానికి ముందుకు వచ్చిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో ఉన్న బోర్లు ఎండిపోవడంతో స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో నీటి కష్టాలు తీర్చడం కోసం రెండు బోర్ల ను వేయడం కోసం బోర్ మెషిన్ ని పంపించగా సర్పంచ్ కావలి సునీత తో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నియోజకవర్గ పరిధిలోని ఏ గ్రామంలో ఏ చిన్ని కష్టం వచ్చినా నేనున్నానంటూ భరోసా అందించడమే కాకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రజా నాయకుడు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాము ఎల్లప్పుడూ గ్రామ అభివృద్ధిలో ముందు ఉంటామన్నారు.కార్యక్రమంలో. ఉపసర్పంచ్ కవిత, రాజు, శ్రీనివాస్, వెంకటప్ప, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

## 70వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

విద్యార్థు లకు నిరంతరంగా అండగా ఉంటున్న జుబేర్ బ్రదర్స్ కు సన్మానించిన ప్రిన్సిపాల్



**కొడంగల్ మున్సిపల్ ,సెప్టెంబర్,18(సమయం న్యూస్)** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర లో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి కోకో అండర్ 14 మొదటి స్థానంలో గురుకుల విద్యార్థులు గెలుపొందారు అదేవిధంగా వాలీబాల్ అండర్ 14 రెండవ స్థానంలో గెలుపొందారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి రామదాసు విద్యార్థులను మరియు క్రీడా ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ మున్ముందు వచ్చే జోనల్ స్థాయి క్రీడలలో మంచి బహుమతులు మరియు పాఠశాలకి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ఎల్ల వేళ్ల తోడుంటాను అని అన్నారు.కొడంగల్ లోని స్థానిక స్పోర్ట్స్ మ్యాన్ అయినటువంటి జుబేర్ విద్యార్థులను వివిధమైన స్పోర్ట్స్ పరికరాలను అందిస్తూ విద్యార్థులకు నిరంతరం అండగా నిలుస్తున్నారు కావున జుబేర్ బ్రదర్స్ కు పాఠశాల తరపున ప్రిన్సిపాల్ బి రామదాస్ సన్మానించడం జరిగింది.

## పంపాడ్ రోడ్డుకు మహర్దశ

మంత్రి చిత్ర పఠనికి పాలాభిషేకం చేసిన గ్రామస్థు లు



**సంగారెడ్డి సెప్టెంబర్ 18 సమయం న్యూస్** రాయికోడ్ మండలం మహిభాత్ పూర్ ఆర్ అండ్ బి రోడ్డు నుండి షాపూర్ పంపాడ్ వరకు బిటి రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామాల నాయకులు మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతాయని ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు నర్సింగ్ రావు పాటిల్, రాజారావు పాటిల్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. రాయికోడ్ మండలంలోని పాంపాడ్ గ్రామానికి నూతన బీటీరోడ్డు మంజూరు కాగా పనులు కొనసాగడంతో పార్టీ నాయకులతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో రోడ్డు మంజూరు చేసినందుకు గాను శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటానికి కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం దామోదర రాజనర్సింహ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాంపాడ్ గ్రామానికి రోడ్డు నిర్మాంచారన్నారు. అనంతరం కనీస మరమ్మత్తులకు నోచుకోక అవస్తలు పద్దామన్నారు. తిరిగి కాంగ్రెస్ పాలనలో మంత్రి సహకారంతో రోడ్డు మంజూరైందన్నారు. 3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి గాను రూ.2.65 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసిన మంత్రికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోహన్ రావు పాటిల్, కృష్ణ మనోహర్ రావు పాటిల్, రామారావు, స్వామిదాస్, కాశినాథ్ పాటిల్, విఠల్, ముర్తజా మారుతిరావ్ పాటల్, కిష్ట ప్ప విటల్, తదితరులు ఉన్నారు.

## మట్టి లో మెరిసిన మాణిక్యం.. ఎంబీబీఎస్ లో నందినికి సీటు

**చిన్నగూడూరు, సెప్టెంబర్ 18( సమయం న్యూస్)** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన వడ్లకొండ భద్రయ్య గౌడ్ కుమార్తె వడ్లకొండ నందిని గౌడ్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. వరంగల్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యకు ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి చూపిన నందిని పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడం గ్రామానికి గర్వకారణమని గ్రామ సర్పంచి బి. రమేశ్, ఉప సర్పంచి జీవన్, వార్డు సభ్యుడు జీనక శేఖర్ అభినందించారు. నందిని భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు నందినిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సర్పంచి సూచించారు.

## 22-ఏ జాబితా నుంచి తప్ప నమోదులు తొలగించాలి

- వక్ఫ్ భూములను రక్షించాలి.. రైతుల, ప్రైవేటు భూములకు విముక్తి కల్పించాలి
- కలెక్టర్లకు ముస్లిం వక్ఫ్ ల్యాండ్ ప్రొటెక్షన్ అసోసియేషన్ వినతి
- వక్ఫ్ భూములను రక్షించాలి...డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి (అడ్వకేట్)



**హనుమకొండ, సెప్టెంబరు 18 (సమయం న్యూస్) :** వక్ఫ్ భూములను రక్షించడంతో పాటు సెక్షన్ 22–ఏ నిషేధిత జాబితాలో పొరపాటున నమోదైన రైతులు, ప్రైవేటు వ్యక్తుల భూములను వెంటనే తొలగించాలని ముస్లిం వక్ఫ్ ల్యాండ్ ప్రొటెక్షన్ అసోసియేషన్–తెలంగాణ నాయకులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి (అడ్వకేట్), డా. ఎం.ఏ. సమద్, ఎం.డి. నయీమ్ ఉద్దీన్ కోరారు. ఈ మేరకు హనుమకొండ జాయింట్ కలెక్టర్, వరంగల్ జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని పలు వక్ఫ్ భూములు ధరణి/భూ భారతి భూ రికార్డుల పోర్టల్‌లో సక్రమంగా నమోదు కాకపోవడంతో వాటి రక్షణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అదే సమయంలో వక్ఫ్‌కు సంబంధం లేని పలువురు రైతులు, ప్రైవేటు వ్యక్తుల భూములు పొరపాటున సెక్షన్ 22–ఏ నిషేధిత జాబితాలో చేరడంతో నిజమైన భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని వక్ఫ్ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, అసలైన వక్ఫ్ ఆస్తులను భూ రికార్డుల పోర్టల్‌లో సక్రమంగా నమోదు చేయాలని కోరారు. 22–ఏ జాబితాలో తప్పుగా నమోదైన రైతులు, ప్రైవేటు భూములను గుర్తించి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ భూముల ఆక్రమణలు, అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారానికి పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు 22–ఏ జాబితాలో భూములు నమోదై ఇబ్బందులు పడుతున్న బాధిత భూ యజమానులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి (అడ్వకేట్), డా. ఎం.ఏ. సమద్, ఎం.డి. నయీమ్ ఉద్దీన్, సయ్యద్ అజాజ్ అహ్మద్ నియాజీ, ఎం.డి. మీర్ అజ్మద్ అలీ, ఎం.డి. ఖలీల్, ఎం.ఏ. రషాద్, ఎం.డి. షుబాన్, ఎం.డి. ఇక్బాల్, ఎం.డి. షఫీ తదితరులు పాల్గొన్నారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,18(సమయం న్యూస్)** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పక్కాగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సూచించారు.అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, వాటి పంపిణీ, విచారణ ప్రక్రియపై ఒక్కో వార్డ్ వారీగా సమీక్షించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించిన నేపథ్యంలో ఈ వెసులుబాటును వినియోగించుకుని నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని అన్నారు.నోటీసుల విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకెళ్లాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రతిరోజూ బీఎల్ఓలు, సూపర్వైజర్ల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు.వేరే ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు ఉంటే, అలాంటి వారు ఫారం – 8 సమర్పించేలా చూడాలన్నారు. చివరి నిమిషంలో హడావుడి పడకుండా గడువు కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు.

## ఉచిత పోలీస్ కోచింగ్ మెటీరియల్ పంపిణీ



**కొడంగల్, సెప్టెంబర్ 18(సమయం న్యూస్)** కొడంగల్ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కడా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పోలీస్ కోచింగ్ పొందుతున్న విద్యార్థులకు శుక్రవారం ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ,కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ పాల్గొని విద్యార్థులకు తమ చేతుల మీదుగా ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాల కోసం కష్టపడి చదివి, అందుబాటులో ఉన్న ఈ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోచింగ్ ఉపాధ్యాయులు, ట్రైనింగ్ కలెక్టర్, కోచింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వెంటనే ప్రారంభించాలి

- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు
- విద్యార్థుల భవిష్యత్తుపై ఆశలు.. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై ఎదురుచూపులు



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్ల మేర పరిపాలనా అనుమతులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

నియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్య అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్‌రెసిడెన్షి యల్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను వేగవంతం చేసి పనులకు శ్రీకారం చుట్టాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంలో ఈ పాఠశాల కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు.

**బాలికల వసతిగృహాల్లో భద్రత పెంచాలి...**

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. బాలికల వసతిగృహాల్లో భవనాలు, ప్రహరీ గోడలు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రాత్రి వేళల్లోనూ భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# సబ్బండ వర్గాల హక్కుల కోసం సమరశంఖం

- 27న హనుమకొండ సభ విజయవంతం చేయాలి... బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ పిలుపు
- సామాజిక న్యాయం కోసం బహిరంగ పంచాయతీ... ముంజాల రాజేందర్ గౌడ్



**నెల్లికుదురు, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** కుల జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు తగిన వాటా కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 27న హనుమకొండలో నిర్వహించనున్న 'ఎవరి కులం ఎంతో.. వారికి అంత వాటా' బహిరంగ పంచాయతీ సభను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. నెల్లికుదురు మండల కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆదేశాల మేరకు ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్‌లో సభ జరుగుతుందని పేర్కొన్నారు. నెల్లికుదురు మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ వరిపెల్లి ఉప్పలయ్య రజక ఆధ్వర్యంలో నిర్వహించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ ముంజాల రాజేందర్‌గౌడ్, కో–కన్వీనర్ గండి వీరేందర్‌గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాంపక సుధాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముంజాల రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ కుల జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు తగిన వాటా కల్పించాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న బహిరంగ పంచాయతీ సభకు అన్ని కులాల ప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వివిధ కులాల ప్రజలు భాగస్వాములైనట్లుగానే, తమ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం నిర్వహిస్తున్న సభలోనూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సాధించుకున్న తెలంగాణలో అన్ని సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం, వాటాపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరికుంట్ల మౌనేందర్ (నాయీ బ్రాహ్మణ), విజయ్ యాదవ్, ఏ. వెంకటేశ్వర్లు (పూసల), కొమ్ము మల్లయ్య మహారాజ్, కే. వీరయ్య, యాదగిరి (ముదిరాజ్), పి. లింగమూర్తి గౌడ్, డి. మల్లయ్య యాదవ్, వరిపెల్లి పూర్ణచందర్, రత్నాపురపు యాకయ్య రజక, బండారి సారంగం (వంశరాజులు), ముసిపట్ల నగేష్ మహారాజ్, ఇరి కృష్ణ మహారాజ్, హెచ్. శుభన్ మహారాజ్, రమణ (పద్మశాలి), గుండెపాక ప్రశాంత్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగ ఏకదంతుని శోభాయాత్ర

**యాలాల మండలం, సెప్టెంబర్,18(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో విగ్నేశ్వర స్వామి శోభాయాత్ర నా భూతో నా భవిష్యత్ అన్న విధంగా ముందుకు సాగింది. మాజీ సర్పంచ్ ఒంగనిబాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లడ్డు వేలం వేసిన అనంతరం, శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. గ్రామ యువతను ఉత్సాహపరిస్తూ, గ్రామ ప్రజలందరినీ కలుపుకొని ఆద్యంతం సాగిన శోభాయాత్ర పండుగ కనుల పండుగా సాగింది. అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ గూరు మల్లేష్ ఇతర యూత్ సభ్యులు విగ్నేశ్వర శోభాయాత్రలో పాల్గొన్నారు. యువత చేసిన డ్యాన్సులు శోభాయాత్రకే వన్నె తెచ్చాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఒంగనిబాయి శ్రీనివాస్, సర్పంచ్ కావలి సునీత, ఉప సర్పంచ్ కవిత గ్రామ ప్రజలందరూ విగ్నేశ్వర స్వామి కృపతో ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ వెదురు దినోత్సవం

### ప్రపంచ వెదురు దినోత్సవం-- ప్రాముఖ్యత

**నారాయణపేట, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్)**



ప్రపంచ ఎదురు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18వ తేదీన నిర్వహించుకుంటామనీ వెదురు యొక్క ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్ర, వెదురు ఆధారిత ఉపాధి అవకాశాలు మరియు వెదురు ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమనీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి హాల్లో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెదురు మన దేశంలో అనాదిగా ఉపయోగించబడుతున్న ఒక ముఖ్యమైన సహజ వనరు. గ్రామీణ ప్రాంతాల్లో వెదురును గృహోపకరణాలు, వ్యవసాయ పనిముట్లు, బుట్టలు, చాపలు మరియు వివిద రకాల హస్తకళా వస్తువుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వెదురుతో ఫర్నిచర్, అలంకరణ వస్తువులు. నిర్మాణ సామగ్రి మరియు అనేక ఇతర ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.వెదురు యొక్క పర్యావరణ ప్రాధాన్యత..వెదురు వేగంగా పెరిగే పునరుత్పాదక సహజ వనరు. ఇతర అనేక చెట్లతో పోలిస్తే కొన్ని వెదురు జాతులు తక్కువ కాలంలోనే అభివృద్ధి చెందుతాయి. అందువల్ల పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం మరియు సహజ వనరుల స్థిరమైన వినియోగంలో వెదురుకు ప్రత్యేక స్థానం ఉంది.వెదురు మొక్కలు నేల సంరక్షణకు, నేల కోతను తగ్గించడానికి మరియు జీవవైవిధ్యానికి సహకరించగలవు. వెదురు పెంపకం ద్వారా పచ్చదనం పెరుగుతుంది. మొక్కలు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ను గ్రహించి కార్బన్ను తమ జీవ ద్రవ్యరాశిలో నిల్వ చేస్తాయి. ఈ విదంగా వెదురు పర్యావరణ సమతుల్యతకు దోహదపడే వనరుగా ఉపయోగపడుతుంది. అయితే వెదురు సాగు చేసే ప్రాంతానికి అనుగుణంగా తగిన జాతులను ఎంపిక చేయడం. నీటి వనరులను సమర్థంగా వినియోగించడం మరియు సహజ వెదురు వనరులను బాధ్యతాయుతంగా సంరక్షించడం ఎంతో అవసరం.వెదురు ఆధారిత ఉపాధి అవకాశాలు..వెదురు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన ఆధారంగా నిలుస్తోంది. వెదురు పెంపకం, సేకరణ, ప్రాసెసింగ్, ఉత్పత్తుల తయారీ మరియు మార్కెటింగ్ ద్వారా అనేక ఉపాధి ఏర్పడుతున్నాయి.అవకాశాలు..వెదురుతో బుట్టలు, గంపలు, కుర్చీలు, టేబుళ్లు. అలంకరణ వస్తువులు, హస్తకళా ఉత్పత్తులు,గృహోపకరణాలు మరియు ఇతర వినియోగ వస్తువులను తయారు చేయవచ్చు. సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాలు తమ నైపుణ్యాలను ఉపయోగించి వెదురు ఉత్పత్తుల తయారీ ద్వారా ఆదాయం పొందవచ్చు. వెదురు ఆధారిత చిన్నతరహా పరిశ్రమలు స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామీణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచవచ్చు. ఉత్పత్తుల నాణ్యత, ఆధునిక డిజైన్, ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్పై శిక్షణ ఇవ్వడం ద్వారా వెదురు ఉత్పత్తులకు మరింత ఆదరణ కల్పించవచ్చు. వెదురు ఉత్పత్తుల వినియోగం..ప్రస్తుత కాలంలో పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగానికి ప్రాధాన్యత పెరుగుతోంది. వెదురుతో తయారు చేసిన వస్తువులు అనేక సందర్భాల్లో ప్లాస్టిక్ మరియు ఇతర పదార్థాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడవచ్చు. వెదురు ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా సహజ వనరుల వినియోగాన్ని ప్రోత్సహించవచ్చు. అయితే ప్రతి ఉత్పత్తికి తగిన పదార్థాన్ని ఎంపిక చేసుకోవడం, ఉత్పత్తి తయారీ ప్రక్రియలో పర్యావరణ ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.వెదురుతో తయారు చేసిన వస్తువులను స్థానిక మార్కెట్లలో, ప్రదర్శనల్లో మరియు వివిధ విక్రయ వేదికల ద్వారా ప్రోత్సహించడం వల్ల చేతివృత్తిదారులకు మార్కెట్ అవకాశాలు మెరుగుపడవచ్చు.

**వెదురు సంరక్షణ – మన బాధ్యత**

వెదురు సహజ వనరు.. అయినప్పటికీ, దాని సంరక్షణకు సమగ్ర చర్యలు అవసరం. వెదురు జాతుల పరిరక్షణ, తగిన ప్రాంతాల్లో సాగు, సహజ వెదురు అడవుల రక్షణ మరియు శాస్త్రీయ పద్ధతుల్లో కోత వంటి చర్యలు చేపట్టాలి. ప్రజలు వెదురు మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకొని వాటి పెంపకం. సంరక్షణలో భాగస్వాములు కావాలి. విద్యార్థులు, యువత, మహిళా సంఘాలు మరియు గ్రామీణ ప్రజలకు వెదురు ఆధారిత ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలి.ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు. చేతివృత్తిదారుల సంఘాలు మరియు ప్రజలు కలిసి పనిచేస్తే వెదురు సాగు, ఉత్పత్తుల తయారీ మరియు మార్కెటింగ్ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవచ్చు.ముగింపు సందేశం.. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా వెదురు యొక్క పర్యావరణ, ఆర్థిక మరియు సామాజిక ప్రాధాన్యతను మనం గుర్తించాలి. వెదురు మొక్కల పెంపకం, సంరక్షణ మరియు వెదురు ఆధారిత ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పచ్చదనం. ఉపాధి మరియు స్థిరమైన అభివృద్ధికి తోడ్పడవచ్చు. వెదురు ఆధారిత వృత్తులపై ఆధారపడిన కుటుంబాలను ప్రోత్సహించడం, సంప్రదాయ నైపుణ్యాలను కాపాడడం మరియు ఆధునిక మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడం మనందరి బాధ్యత. "వెదురును పెంచుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం వెదురు ఆధారిత ఉపాధిని ప్రోత్సహిద్దాం – హరిత భవిష్యత్తును నిర్మిద్దాం." ఈ సమావేశంలో ఎ . ఓ.అనిల్, డిపిఆర్ఓ ఎంఎ రషీద్, సిపిఓ మున్సిపల్ కమిషనర్ శంకర్ , బాలాజి, సభ్యులు సాయిబాబా, కృష్ణ, పావని, కృష్ణ,వెంకటేశ్వరమ్మ గౌరమ్మ,తదితరులు పాల్గొన్నారు......



# ఐదు ఓవర్లలోనే ఫినిష్

## భారత్ సరికొత్త రికార్డు!

### జపాన్‌పై ఎనిమిది వికెట్ల ఘన విజయం

**నిషిన్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత భారత బౌలర్ల ధాటికి జపాన్ 19.5 ఓవర్లలో 57 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ కేవలం ఐదు ఓవర్లలో రెండు వికెట్లకు 59 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించింది. 90 బంతులు మిగిలుండగానే సాధించిన ఈ విజయం భారత మహిళల టీ20 అంతర్జాతీయ చరిత్రలో బంతుల పరంగా అతిపెద్ద విజయంగా నమోదైంది. జపాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించారు. నాలుగు ఓవర్లలో కేవలం 10 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. షఫాలీ వర్మ రెండు వికెట్లు తీయగా, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ సాధించారు. జపాన్ తరఫున అయాకా కాటో-స్టాఫర్డ్ 25 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. 58 పరుగుల లక్ష్య ఛేదనలో కమలిని డకౌట్ కాగా, భారతి ఫుల్మాలి ఆరు పరుగులకు వెనుదిరిగారు. అయితే షఫాలీ వర్మ జపాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 15 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 40 పరుగులు చేశారు. రిచా ఘోష్ ఆరు బంతుల్లో 12 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఐదో ఓవర్ చివరి బంతిని షఫాలీ సిక్సర్‌గా మలిచి విజయాన్ని ఖాయం చేశారు. ఈ విజయంతో భారత్ తన పేరిటే ఉన్న పాత రికార్డును అధిగమించింది. 2022లో థాయ్‌లాండ్‌పై 84 బంతులు మిగిలుండగానే గెలవగా.. ఇప్పుడు జపాన్‌పై ఏకంగా 90 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. సెప్టెంబర్ 20న జరిగే సెమీఫైనల్లో భారత్ బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

# ఆనందికి స్వర్ణం, కాంస్యం

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 17:** తెలంగాణ అథ్లెట్ నల్లవెల్లి ఆనంది సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలతో ఆకట్టుకుంది. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఆనంది అండర్-18 బాలికల 400 మీటర్ల విభాగంలో స్వర్ణం, 200 మీటర్ల పరుగులో కాంస్యం సాధించింది. పుదుచ్చేరిలో గురువారం జరిగిన 400 మీటర్ల ఫైనల్లో అందరికంటే వేగంగా 56.42 సెకండ్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. 200 మీటర్ల తుదిపోరులో 25.66 సెకండ్లలో మూడో స్థానం సాధించింది.



# మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే గది!

## నాగోయాలో భారత బృందానికి వసతి చిక్కులు





**నాగోయా, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత బృందానికి వసతి ఏర్పాట్లలో వరుస చిక్కులు ఎదురవుతున్నాయి. తాజాగా భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్, ఆమె పురుష కోచ్ అశోక్ మిశ్రాకు నిర్వాహకులు ఒకే గదిని కేటాయించడం గందరగోళానికి దారితీసింది. దీనిపై ఇద్దరూ వెంటనే అభ్యంతరం వ్యక్తం చేసి స్థానిక నిర్వాహకులు, భారత బృందం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గంటలపాటు ప్రయత్నించిన అనంతరం భారత ఒలింపిక్ సంఘం జోక్యంతో ప్రణతి, మిశ్రాకు వేర్వేరు వసతి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అర్ధరాత్రి దాటినా కొనసాగగా.. సుమారు రాత్రి 1.30 గంటలకు ప్రత్యామ్నాయ గది ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే కోచ్ అశోక్ మిశ్రాకు అక్కడితో సమస్య తీరలేదు. ప్రత్యేక గది తాళాలు తీసుకునేందుకు వెళ్లగా హోటల్ రిజిస్టర్‌లో ఆయన బుకింగ్ కనిపించలేదు. అధికారిక వివరాల్లో ఆయన పేరులోని ఒక అక్షరం నమోదు కాకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు సమాచారం. బుకింగ్‌ను గుర్తించి, అక్రిడిటేషన్‌ను ధ్రువీకరించేందుకు మరో 45 నిమిషాలు పట్టడంతో రాత్రి 2 గంటల తర్వాతే ఆయన గదికి చేరుకోగలిగారు. ఈ ఘటనపై ప్రణతి నాయక్ స్పందిస్తూ వసతి విషయంలో గందరగోళం జరిగిన మాట వాస్తవమేనని, రాత్రి 2 గంటల సమయంలో సమస్య పరిష్కారమైనట్లు తెలిపారు. భారత బృందం నాగోయాకు చేరుకున్నప్పటి నుంచి మరికొందరు అథ్లెట్లు కూడా గదుల కేటాయింపు కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చినట్లు సమాచారం. శిక్షణకు వెళ్లే ఏర్పాట్లు, పోషకాహారం విషయంలోనూ ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. భారత కబడ్డీ బృందానికీ హోటల్ గదుల కేటాయింపు, చెక్‌ఇన్‌లో సమస్యలు ఎదురైనట్లు సమాచారం. పోటీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వసతి, ఇతర ఏర్పాట్లలో ఇకపై ఇలాంటి సమన్వయ లోపాలు తలెత్తకుండా చూడాలని అథ్లెట్లు, కోచ్‌లు కోరుతున్నారు.

# కాటేరమ్మ కొడుకుల విశ్వరూపం

## బాదుడే బాదుడు!

### నిన్న అభిషేక్.. నేడు ట్రావిస్ హెడ్

### 84 బంతుల్లో 112 పరుగులతో హెడ్ విధ్వంసం

### 30 బంతుల్లోనే అభిషేక్ రికార్డు శతకం



**హరారే, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఇప్పుడు తమ దేశాల తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అదే దూకుడు చూపిస్తున్నారు. నిన్న అఫ్గానిస్థాన్‌పై అభిషేక్ రికార్డు శతకంతో విరుచుకుపడితే.. తాజాగా జింబాబ్వేపై ట్రావిస్ హెడ్ సెంచరీతో చెలరేగిపోయాడు. దీంతో ఎస్‌ఆర్‌హెచ్ అభిమానులు తమదైన శైలిలో వీరిద్దరినీ 'కాటేరమ్మ కొడుకులు' అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. హరారే వేదికగా శుక్రవారం జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో ట్రావిస్ హెడ్ 84 బంతుల్లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లతో 112 పరుగులు చేశాడు. కేవలం 75 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. హెడ్ విధ్వంసానికి కెప్టెన్ మిచెల్ మార్ష్ 53, కూపర్ కానొలీ 78 పరుగులతో తోడవడంతో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 356 పరుగుల భారీ స్కోరు చేసింది. మరోవైపు గురువారం ఢిల్లీలో అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లోనే శతకం బాది రికార్డు సృష్టించాడు. మొత్తం 34 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, 11 సిక్సర్లతో 108 పరుగులు చేశాడు. ఇది భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన అంతర్జాతీయ టీ20 శతకం. పూర్తి సభ్య దేశాల మధ్య జరిగిన టీ20ల్లోనూ ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. అభిషేక్ దెబ్బకు భారత్ 221 పరుగులు చేయగా.. అఫ్గానిస్థాన్‌ను 94 పరుగులకే కట్టడి చేసి 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లుగా హెడ్-అభిషేక్ జోడీ ఎన్నోసార్లు పవర్‌ప్లేలో పరుగుల సునామీ సృష్టించింది. ఇప్పుడు ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరూ తమ జాతీయ జట్ల తరఫున సెంచరీలతో చెలరేగడం ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందిస్తోంది. సోషల్ మీడియాలోనూ వీరిద్దరి బ్యాటింగ్‌ను పోలుస్తూ అభిమానుల పోస్టులు సందడి చేస్తున్నాయి.

# క్లీన్‌స్వీప్ చేసినా.. నంబర్ వన్‌కు ముప్పే!

## భారత్‌కు ఇంగ్లండ్ నుంచి గట్టి పోటీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** అఫ్గానిస్థాన్‌ను టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నా.. ఇంగ్లండ్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్, ఇంగ్లండ్ రెండూ 269 రేటింగ్ పాయింట్లతో సమంగా ఉన్నాయి. అయితే మొత్తం పాయింట్ల పరంగా భారత్ ముందుండటంతో అగ్రస్థానం కొనసాగుతోంది. ఐసీసీ అధికారిక పేజీలోనూ భారత్ ప్రస్తుతం 269 రేటింగ్‌తో నంబర్ వన్‌గా ఉంది. శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లను గెలిచి 2--0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. రెండో మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో నెగ్గిన ఇంగ్లండ్.. శనివారం మాంచెస్టర్‌లో జరిగే చివరి టీ20లోనూ విజయం సాధిస్తే ర్యాంకింగ్ లెక్కల్లో భారత్‌పై ఒత్తిడి మరింత పెరగనుంది. తాజా పట్టికలో భారత్ 269 రేటింగ్‌తో మొదటి స్థానంలో ఉండగా ఇంగ్లండ్ 269తో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా 260తో మూడో స్థానం, న్యూజిలాండ్ 247తో నాలుగో స్థానం, దక్షిణాఫ్రికా 243తో ఐదో స్థానంలో ఉన్నాయి. పాకిస్థాన్ 240, వెస్టిండీస్ 234, బంగ్లాదేశ్ 224 రేటింగ్ పాయింట్లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. శ్రీలంక, అఫ్గానిస్థాన్ చెరో 220 రేటింగ్‌తో తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. అఫ్గానిస్థాన్‌పై సిరీస్ విజయంతో అగ్రస్థానాన్ని కాపాడుకున్న భారత్‌కు ఇప్పుడు ఇంగ్లండ్ అత్యంత సమీపంలోకి వచ్చింది. దీంతో శ్రీలంక-ఇంగ్లండ్ చివరి టీ20 అనంతరం ర్యాంకింగ్ లెక్కలు ఎలా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# బీసీసీఐ కీలక నిర్ణయాలు



- ఐపీఎల్-2027పై స్పెషల్ ఫోకస్
- లైంగిక వేధింపుల నిరోధానికి కొత్త కమిటీ
- ఐపీఎల్ పాలక మండలిలో కొత్త నియామకాలు
- 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక
- 2028 శతాబ్ది ఉత్సవాలకు ఇప్పటి నుంచే రోడ్‌మ్యాప్
- అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు వేతనాల పెంపు

**ముంబై, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** భారత క్రికెట్ నియంత్రణ మండలి 95వ వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బోర్డు పాలన, ఆర్థిక వ్యవహారాలు, మ్యాచ్ అధికారుల సంక్షేమం, ఐపీఎల్-2027 నిర్వహణతోపాటు బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. క్రీడాకారులు, సిబ్బందికి సురక్షిత వాతావరణం కల్పించడంలో భాగంగా లైంగిక వేధింపుల నిరోధక విధానం కింద కొత్త అంతర్గత కమిటీ ఏర్పాటుకు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. క్రికెటర్ల వయసు నిర్ధారణ విధానంలో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన మార్పులకూ పచ్చజెండా ఊపింది.

## ఐపీఎల్-2027పై ప్రత్యేక దృష్టి

ఐపీఎల్ పాలక మండలిలో అరుణ్ సింగ్ ధుమాల్, ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్‌లను ప్రతినిధులుగా నియమించారు. 2027లో ఐపీఎల్ 20వ ఎడిషన్ జరగనున్న నేపథ్యంలో ఈ మైలురాయిని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. బీసీసీఐ వందేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు కూడా రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు. 2027 డిసెంబర్ నుంచి 2028 వరకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

## అంపైర్లు, రిఫరీలకు తీపికబురు

అంపైర్లు, మ్యాచ్ రిఫరీల చెల్లింపులను పెంచడంతోపాటు వారి గ్రేడింగ్ వ్యవస్థను పునర్వర్గీకరించేందుకు ఆమోదం లభించింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ ఖాతాలు, 2026--27 వార్షిక బడ్జెట్‌తోపాటు తదుపరి ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్ల నియామకానికీ బోర్డు ఆమోదముద్ర వేసింది. దివ్యాంగ క్రికెటర్ల అభివృద్ధిపైనా బీసీసీఐ ప్రత్యేక దృష్టి సారించింది. వారికి అవసరమైన వనరులు, మెరుగైన శిక్షణ, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర క్రికెట్ సంఘాలతో కలిసి సమగ్ర చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.



# ప్రెగ్నెన్సీలోనూ తగ్గేదేలే..


## దీపిక మరో సినిమాకు ఓకే?

## ‘రాకా’, ‘కింగ్’ షూటింగ్స్ పూర్తి చేసినట్లు టాక్

**ముంబై, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** రెండోసారి తల్లి కాబోతున్న బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె సినిమాలకు మాత్రం విరామం ఇచ్చే ఆలోచనలో లేనట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గర్భవతిగా ఉన్న సమయంలోనూ ‘రాకా’, ‘కింగ్’ చిత్రాల షూటింగుల్లో పాల్గొని తనకు సంబంధించిన సన్నివేశాలను ఇప్పటికే పూర్తి చేసినట్లు సమాచారం. ఇప్పుడు మరో పెండింగ్ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇటీవల ‘స్పిరిట్’, ‘కల్కి-2’ ప్రాజెక్టుల నుంచి దీపిక తప్పుకోవడం చర్చనీయాంశమైంది. ‘స్పిరిట్’ విషయంలో ఆమె పెట్టిన కొన్ని షరతులపై చిత్రబృందంతో విభేదాలు తలెత్తినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ‘కల్కి-2’ నుంచి తప్పుకోవడంపైనా పలు కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలోని అన్ని అంశాలపై దీపిక స్వయంగా వివరణ ఇవ్వలేదు.ఆ తర్వాత ‘రాకా’, ‘కింగ్’ చిత్రాలకు ఆమె కమిట్ అయినట్లు సమాచారం. రెండోసారి తల్లి కాబోతున్నట్లు వెల్లడైనప్పటికీ షూటింగులకు విరామం ఇవ్వకుండా తన పోర్షన్లు పూర్తి చేసినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ‘రాకా’లో కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశముందనే టాక్ వినిపిస్తోంది. ‘కింగ్’లో షారుఖ్ ఖాన్‌తో దీపిక మరోసారి తెర పంచుకోనుండగా, ఆమె పాత్ర పరిమితంగానే ఉంటుందని సమాచారం. ఇదిలా ఉండగా హాలీవుడ్ కామెడీ డ్రామా ‘ది ఇంటర్న్’ హిందీ రీమేక్‌ను మళ్లీ పట్టాలెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు దీపిక దాదాపు ఆరేళ్ల క్రితమే అంగీకరించినప్పటికీ వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. ఇప్పుడు మరోసారి ఈ సినిమాపై కదలిక మొదలైనట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే ‘పీకూ’ తర్వాత అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె మరోసారి కలిసి నటించే అవకాశం ఉంటుంది. అయితే కొత్త ప్రాజెక్టు ప్రారంభం, షూటింగ్ తేదీలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# రాకేష్ మాస్టర్‌ను తలచుకున్న ఉదయభాను

**హైదరాబాద్, సెప్టెంబరు 18 (సమయం న్యూస్):** దివంగత నృత్య దర్శకుడు రాకేష్ మాస్టర్‌ను తలచుకుని ప్రముఖ యాంకర్ ఉదయభాను భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. రాకేష్ మాస్టర్ మరణవార్తను మొదట నమ్మలేదని, నిజమని తెలిసిన తర్వాత తీవ్రంగా బాధపడ్డానని తెలిపారు. తన కెరీర్ ప్రారంభంలో ‘హోరాహోరీ’ నృత్య కార్యక్రమం ద్వారా రాకేష్ మాస్టర్‌తో పరిచయం ఏర్పడిందని ఉదయభాను చెప్పారు. తనకు నృత్యంపై పెద్దగా అవగాహన లేని సమయంలోనూ ‘నువ్వు ఈ స్టెప్ చేయగలవు’ అంటూ ఆయన ఎంతో ధైర్యం ఇచ్చేవారని గుర్తుచేసుకున్నారు. రాకేష్ మాస్టర్ కేవలం నృత్య దర్శకుడు మాత్రమే కాదని, గొప్ప గురువని ఉదయభాను పేర్కొన్నారు. ప్రభుదేవా, శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వంటి పలువురు ప్రముఖ నృత్య దర్శకులను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. తాను అనుకున్న విధంగా కళాకారులతో నృత్యం చేయించగల ప్రత్యేక ప్రతిభ ఆయన సొంతమని అన్నారు. అయితే జీవితంలో ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావంతో చివరి రోజుల్లో పరిశ్రమకు, తనవారికి దూరం కావడం బాధాకరమని ఉదయభాను అన్నారు. ఇటీవల ఆయన ఆధ్వర్యంలో ఓ పాటలో నటించినప్పుడు పూర్తి ఉత్సాహంతో కనిపించారని గుర్తుచేసుకున్నారు. తెరపై తాను అనుకున్న ఫలితం వచ్చే వరకు నిద్రపోని పరిపూర్ణ గురువు రాకేష్ మాస్టర్ అని కొనియాడారు. రాకేష్ మాస్టర్ మరణం తర్వాత ఆయన శిష్యులు శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు తనను ఎంతో బాధించాయని ఉదయభాను చెప్పారు. ఎంతోమంది పేదలకు, అనాథలకు అన్నం పెట్టిన గొప్ప మనసున్న వ్యక్తి ఆయన అని గుర్తుచేసుకున్నారు. తనకు తెలిసినంతవరకు రాకేష్ మాస్టర్ ఎప్పుడూ తన పట్ల మంచిగానే ఉన్నారని, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని ఉదయభాను పేర్కొన్నారు.



# ‘పెద్ది’ని దాటి.. ఆస్కార్ బరిలో ‘గొంధల్’!

## భారత్ అధికారిక ఎంట్రీగా మరాఠీ చిత్రం

## 33 చిత్రాల నుంచి ఎంపిక చేసిన జ్యూరీ

## పోటీలో ‘పెద్ది’, ‘హనుమాన్ అంశ్’, ‘ధురంధర్’

## సంతోష్ దవాఖర్ దర్శకత్వంలో థ్రిల్లర్

## మార్చి 14న 99వ ఆస్కార్ వేడుకలు




**ముంబై, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** ప్రతిష్ఠాత్మక 99వ అకాడమీ అవార్డులకు భారత్ తరఫున మరాఠీ చిత్రం ‘గొంధల్’ అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగానికి పంపుతున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా పరిశీలనకు వచ్చిన 33 చిత్రాల నుంచి జ్యూరీ ‘గొంధల్’ను ఎంపిక చేసింది. ఈ పోటీలో తెలుగు నుంచి ‘పెద్ది’, ‘ఇరుముడి’, ‘సింగ్ గీతం’, ‘ఎగ్వా’ సహా నాలుగు చిత్రాలు ఉన్నాయి. హిందీ నుంచి ‘ధురంధర్’, ‘ధురంధర్: ది రివెంజ్’, ‘హనుమాన్ అంశ్’, ‘బోర్డర్--2’, ‘ఇక్కిస్’ తదితర చిత్రాలు పరిశీలనకు వచ్చాయి. మొత్తం 33 చిత్రాలను పరిశీలించిన అనంతరం జ్యూరీ మరాఠీ చిత్రం ‘గొంధల్’ వైపు మొగ్గుచూపింది.

### సంప్రదాయం నేపథ్యంలో థ్రిల్లర్

మహారాష్ట్రలోని సంప్రదాయ ‘గొంధల్’ ఆచారాన్ని నేపథ్యంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు. సంగీతం, నృత్యం, పురాణ కథనాలతో రాత్రంతా సాగే సంప్రదాయ ప్రదర్శన చుట్టూ కథ నడుస్తుంది. పెళ్లి వేడుకతో మొదలయ్యే కథ క్రమంగా కోరికలు, అసూయ, ద్రోహం, గ్రామంలో దాగున్న సంఘర్షణలను వెలికితీసే థ్రిల్లర్‌గా మారుతుంది. కిశోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేశ్ సోహోని, నిషాద్ భోయిర్, అనుజ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సంతోష్ దవాఖర్‌కు ఇదే తొలి ఫీచర్ చిత్రం. గోవాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలోనూ ‘గొంధల్’ ప్రత్యేక గుర్తింపు పొందింది. దవాఖర్‌కు సిల్వర్ పీకాక్ పురస్కారం దక్కింది. అయితే భారత్ అధికారిక ఎంట్రీగా ఎంపిక కావడం ఆస్కార్ నామినేషన్ ఖరారైనట్లు కాదు. అంతర్జాతీయ ఫీచర్ విభాగంలో వివిధ దేశాల నుంచి వచ్చిన చిత్రాలను అకాడమీ పరిశీలించి ముందుగా 15 చిత్రాలతో షార్ట్‌లిస్ట్‌ను, అనంతరం తుది ఐదు నామినేషన్లను ప్రకటిస్తుంది. 99వ అకాడమీ అవార్డుల వేడుక 2027 మార్చి 14న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరగనుంది.

# సౌందర్యను తలచుకుని ఆమని భావోద్వేగం





**హైదరాబాద్, సెప్టెంబరు 18 (సమయం న్యూస్):** దివంగత నటి సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని నటి ఆమని భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. సౌందర్య తనకు కేవలం సహనటి మాత్రమే కాదని, జీవితంలో ఎంతో సన్నిహితమైన స్నేహితురాలని తెలిపారు. వ్యక్తిగత విషయాలను సైతం తనతో పంచుకునేదని, తామిద్దరం మంచి స్నేహితులమని చెప్పారు. షూటింగ్‌లు లేని సమయంలో సౌందర్య తనను ఇంటికి పిలిచేదని ఆమని గుర్తు చేసుకున్నారు. తాను స్వయంగా నిర్మిస్తున్న సినిమా చిత్రీకరణకు వచ్చి ప్రోత్సహించాలని కూడా సౌందర్యను కోరినట్లు తెలిపారు. అయితే ఆమె మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ వార్త విన్న సమయంలో తాను నమ్మలేకపోయానని, షూటింగ్‌లో ఉండగా విషయం తెలియగానే చేతులు వణికాయని, మాట కూడా రాలేదని ఆమని చెప్పారు. సౌందర్యను చివరిసారి చూసేందుకు వెంటనే వెళ్లలేకపోయానని, ఆ దుఃఖాన్ని తట్టుకోలేనని భావించి నెల రోజుల తర్వాత ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ సౌందర్య తల్లి మాత్రమే ఉన్నారని, హాల్‌లో సౌందర్య, ఆమె తండ్రి, తమ్ముడు అమర్ ఫొటోలు కనిపించాయని గుర్తుచేసుకున్నారు. ఇటీవల బెంగళూరులోని సౌందర్య ఇంటికి వెళ్లినప్పుడు అది నిర్మానుష్యంగా మారి ఉండటం చూసి ఎంతో బాధపడ్డానని ఆమని ఆవేదన వ్యక్తం చేశారు. సౌందర్య వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ.. తెరపై ఎంత అందంగా కనిపించేదో, నిజ జీవితంలో అంతకంటే గొప్ప మనసున్న వ్యక్తి అని ఆమని కొనియాడారు. క్రమశిక్షణతో జీవించడం సౌందర్యకు అలవాటని, తన తండ్రి మాటకు ఎంతో విలువ ఇచ్చేదని గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలో తండ్రి స్వీట్లు తినొద్దంటే వాటిని కూడా మానేసేదని చెప్పారు. ఇదే సందర్భంగా కార్తికేయ, ప్రకాష్ రాజ్, నాగార్జున, కమల్ హాసన్, రోజా తదితరులతో కలిసి పనిచేసిన అనుభవాలను కూడా ఆమని పంచుకున్నారు. కార్తికేయ పెద్ద సంభాషణలను సైతం ఒకే ప్రయత్నంలో చెప్పడం చూసి తాను ఆశ్చర్యపోయానని తెలిపారు.

# వెయ్యి కోట్ల క్లబ్‌లో మమితా బైజు



**హైదరాబాద్, సెప్టెంబరు 18 (సమయం న్యూస్):** వరుస విజయాలతో మలయాళ భామ మమితా బైజు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. గత ఆరు నెలల్లో ఆమె నటించిన సినిమాలు భారీ వసూళ్లు సాధించడంతో మొత్తం వెయ్యి కోట్ల మార్క్‌ను దాటినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం మమితా బైజు పేరు దక్షిణాది సినీ వర్గాల్లో మార్మోగుతోంది. ధనుష్‌తో కలిసి నటించిన ‘కర’ సినిమా పెద్దగా విజయాన్ని అందుకోకపోయి-ఃనా రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథ్‌తో నటించిన ‘డ్యూడ్’ చిత్రం రూ.100 కోట్ల వసూళ్లు సాధించింది. విజయ్ నటించిన ‘జననాయగన్’ రూ.300 కోట్లు, ఇటీవల విడుదలైన మలయాళ చిత్రం ‘బెత్లహోమ్ కుటుంబ యూనిట్’ రూ.300 కోట్లు, సూర్య నటించిన ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ రూ.260 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇలా వరుస చిత్రాల విజయాలతో మమితా బైజు మార్కెట్ ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా ఆమె నటించిన మూడు చిత్రాలు వరుసగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషంగా మారింది. తక్కువ సమయంలోనే భారీ విజయాలు అందుకుంటూ మమితా బైజు తన కెరీర్‌లో దూసుకెళ్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే

- షేక్ బందగి త్యాగం: ఇసునూరి రామచంద్రారెడ్డి పతనం పోరాటానికి ప్రతిరూపాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్



**ఆలేరు, సెప్టెంబరు 18(సమయం న్యూస్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి ఆలేరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా బస్సుయాత్ర బృందం ఆలేరు పట్టణానికి చేరుకుని స్థానిక బస్టాండ్ వద్ద అమరవీరులకు నివాళులర్పించింది. ముందుగా సీపీఎం పట్టణ సీనియర్ నాయకుడు ఘనగాని మల్లేశం జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణ కార్యదర్శి ఎం.ఎ. ఇక్బాల్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ నిజాం పాలనలోని భూస్వామ్య వ్యవస్థలో రైతులు, కూలీలు, పేద ప్రజలు ఎదుర్కొన్న వెట్టి చాకిరీ, అక్రమ పన్నులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా గ్రామీణ ప్రజలు సంఘటితమై పోరాటం సాగించారని తెలిపారు. పది లక్షల ఎకరాలు రైతులకు పంచారు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనేక మంది అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితంగా సుమారు పది లక్షల ఎకరాల భూమి రైతులకు పంచబడిందని జహంగీర్ పేర్కొన్నారు. వెట్టి చాకిరీ నిర్మూలనకు, కౌలుదారుల రక్షణకు ఈ పోరాటం దోహదపడిందన్నారు. 'దున్నేవాడికే భూమి' అనే నినాదం దేశవ్యాప్తంగా విస్తరించడానికి తెలంగాణ పోరాటం ప్రభావం చూపిందని చెప్పారు.

**చరిత్రను వక్రీకరించొద్దు**

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మతపరమైన కోణంలో చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని జహంగీర్ విమర్శించారు. ఈ పోరాటం హిందూ–ముస్లిం పోరాటం కాదని, భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ, బానిసత్వానికి వ్యతిరేకంగా, తెలంగాణ ప్రాంత విముక్తి కోసం సాగిన ప్రజా ఉద్యమమని అన్నారు. భాష, సంస్కృతిపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా కూడా ప్రజలు పోరాడారని తెలిపారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పత్రికలో వార్తలు రాసినందుకు హత్యకు గురైన షోయబుల్లా ఖాన్ ఏ మతానికి చెందినవారని ఆయన ప్రశ్నించారు. నిజాంకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి విజయం సాధించిన షేక్ బందగి ఏ మతానికి చెందినవారని ప్రశ్నించారు. భూస్వామ్య దోపిడీకి ప్రతీకగా నిలిచిన ఇసునూరి రామచంద్రారెడ్డి ఉదంతాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించారని జహంగీర్ తెలిపారు. పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, మాటూరి బాలరాజు, దాసరి పాండు, మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోరిగాడి చంద్రశేఖర్, పట్టణ నాయకులు మోరిగాడి రమేష్, జూకంటి పౌలు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, బుర్రు అనిల్, వడ్డేమాన్ బాలరాజు, మోరిగాడి అజయ్, కాసుల నరేష్, చెన్న రాజేష్, యాసారపు ప్రసాద్, వడ్డేమాన్ విప్లవ్, మాదాని నవీన్, ఎం.డి. మతిన్, ఎం.డి. ఖలీల్, కటకం సుదర్శన్, కొరటూరి ఉపేందర్, బొమ్మకంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘం నాయకులు మోరిగాడి స్వరూప, మోరిగాడి భాగ్యలక్ష్మి, ఘనగాని భాగ్యమ్మ, అంజమ్మ, మైలారం కళ్యాణి, అయిలి చంద్రకళ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

- యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి ఆలయ ఆదాయంలో వాటా ఇవ్వాలి
- ఆలేరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ఆలేరు, సెప్టెంబర్ 18(సమయం న్యూస్):** ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాలిటీలకు సొంత ఆదాయ వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ ప్రజలకు మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సేవలను అందిస్తున్నాయని తెలిపారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

**ఆలయ ఆదాయంలో వాటా ఇవ్వాలి**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారని, వారి సౌకర్యాల కోసం మున్సిపాలిటీ అనేక సేవలు అందిస్తోందని అయిలయ్య తెలిపారు. గతంలో యాదగిరిగుట్ట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఆలయ ఆదాయంలో వాటా లభించేదని, ప్రస్తుతం మున్సిపాలిటీగా మారిన తర్వాత ఆ ఆదాయ వనరు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. రోజుకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి ఆలయ ఆదాయం నుంచి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రస్తావించిన అంశాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగంగా భక్తులు, స్థానిక ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీకి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు.

**200 షాపుల సమస్య పరిష్కరించాలి**

యాదగిరిగుట్ట అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన బ్రిడ్జి కారణంగా సుమారు 200 మంది వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అయిలయ్య తెలిపారు. బ్రిడ్జి కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతిని జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అవసరమైతే బ్రిడ్జి తొలగింపు అంశాన్ని పరిశీలించి వ్యాపారుల సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యాదగిరిగుట్టను సందర్శించిన సందర్భంగా బాధితుల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు.

**భూసేకరణ బాధితులకు న్యాయం చేయాలి**

యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం భూసేకరణలో ఇళ్లు, షాపులు, భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని బీర్ల అయిలయ్య కోరారు. సైదాపూర్‌లోని 329.314 సర్వే నంబర్ పరిధిలో అర్హులైన వారికి పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

**ఆలేరుకు రెవెన్యూ డివిజన్ హోదా**

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అని, పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**ఆలేరు మున్సిపాలిటీకి ప్రత్యేక దృష్టి**

ఆలేరు మున్సిపాలిటీ పేరుకే మున్సిపాలిటీగా ఉండకుండా అవసరమైన నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పట్టణంలోని రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలేరు నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి ఆలయ ఆదాయంలో వాటా, ఆలేరుకు రెవెన్యూ డివిజన్ హోదా వంటి అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు.

# కోర్టు ఆదేశాలున్నా.. పట్టపగలే దౌర్జన్యం!

- 86 ఏళ్ల వృద్ధ రైతు ఆవేదన.. న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు
- న్యాయం కోసం 86 ఏళ్ల రైతు 'సందసాని లక్ష్మీనారాయణ' ఆర్తనాదం
- కోర్టు ఉత్తర్వులు బేఖాతర్. వృద్ధ రైతు భూమిలో సాగు!



**హనుమకొండ, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్) :** కోర్టు రక్షణ ఉన్నప్పటికీ తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని 86 ఏళ్ల వృద్ధ రైతు సందసాని లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నప్పటికీ కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్న సమయంలోనూ తనకు న్యాయం జరగడం లేదని వాపోయారు. శుక్రవారం హనుమకొండలో మీడియాతో మాట్లాడిన ఆయన తనకు జరిగిన అన్యాయంపై వివరాలు వెల్లడించారు. కమలాపూర్ మండలం అంబాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 789/ఈ, 789/డిలో మొత్తం 2.10 ఎకరాల భూమి ఉందని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ భూమిని అంబాల గ్రామానికి చెందిన శ్రీరాముల లింగమూర్తి, బోళ్ల సందీప్ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బోళ్ల సందీప్‌పై గతంలో నకిలీ పాస్‌పుస్తకాలకు సంబంధించిన కేసు ఉందని, 2019లో నకిలీ సర్వే నివేదికను సృష్టించి కోర్టులో కేసు వేయగా న్యాయస్థానం ఆ కేసును కొట్టివేసిందని ఆయన పేర్కొన్నారు. 2021లో తన భూమిలోకి వచ్చి పంటకు నష్టం కలిగించడంతో పాటు పంటను కాల్చివేశారనే ఆరోపణలపై కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే ఐదేళ్లు దాటినా ఈ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల హనుమకొండ సివిల్ కోర్టు తన భూమికి సంబంధించి ఇంజక్షన్‌తో పాటు పోలీస్ రక్షణకు ఆదేశాలు జారీ చేసిందని లక్ష్మీనారాయణ తెలిపారు. ఆ ఆదేశాలు అమల్లో ఉన్న సమయంలోనే, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ జూలై 2న తన భూమిని దున్నడంతో పాటు పైప్‌లైన్ వేసి మిరప పంట సాగు చేస్తున్నారని ఆరోపించారు. తన వయసు 86 సంవత్సరాలని, భూమి విషయంలో జరుగుతున్న పరిణామాలు తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాయని లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై జిల్లా కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి, కోర్టు ఆదేశాలను అమలు చేయడంతో పాటు తనకు న్యాయం చేయాలని కోరారు.

# అప్పాయిపల్లి గ్రామములో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

**కొడంగల్ మండలం, సెప్టెంబర్,18(సమయం న్యూస్)** కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామంలో డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఉపసర్పంచ్ పకీరప్ప పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి శేఖర్ వార్డ్ మెంబర్లు శ్యామా గోకుల్ సింగ్ రాములు మాజీ సర్పంచ్ దత్తు సింగ్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు c బాలరాజ్ గ్రామ అధ్యక్షుడు సంగప్ప గ్రామస్తులు సంతోష్ వెంకటప్ప అశోక్ కాశప్ప రమేష్ ఎల్లప్ప తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు



# మరణం తర్వాత కూడా.. మానవత్వం బతికేలా..

- జన్మదిన వేళ.. అవయవ దాన సంకల్పం
- ఘనంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు...నేత్ర, అవయవ, శరీరదానానికి ముందుకు..



**నర్సంపేట, సెప్టెంబరు 18 (సమయం న్యూస్) :** జన్మదిన వేడుకలను సామాజిక సేవకు వేదికగా మలుస్తూ నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్(ఎన్జీవో) ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆదర్శప్రాయంగా నిలిచారు. తన మరణానంతరం నేత్ర, అవయవ, శరీరదానం చేయడానికి ఆయన ముందుకు వచ్చారు. బీసీ సంక్షేమ సంఘం, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, బీసీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమక్షంలో నర్సంపేటలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ గోవిందు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజన్‌బాబు, ఫౌండేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. దళపతి, అంతర్జాతీయ వనప్రేమ అవార్డు గ్రహీత నల్లగొండ సమ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ కు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా మొక్క నాటి వృక్ష సంపదను పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నల్లగొండ సమ్మయ్య అన్నారు. నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఎస్సై రాజన్‌బాబు పేర్కొన్నారు. శ్రీనివాస్ మరణానంతరం దానానికి ముందుకు రావడం సమాజానికి మంచి సందేశమన్నారు. సదాశయ ఫౌండేషన్ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రేరణ పొంది డ్యాగల శ్రీనివాస్‌తో పాటు చింతల కళావతి, పిట్టల కవితలు కూడా నేత్రదానానికి ముందుకు వచ్చారని డాక్టర్ దళపతి తెలిపారు. వారికి ఎస్సై రాజన్‌బాబు, ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశంసాపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు డ్యాగల రమణమ్మ, స్వరూప, డ్యాగల శ్యామ్ ప్రసాద్, శారద, కమల్‌సాయి, రామ్‌చరణ్‌సాయి తదితరులతో పాటు బీసీ సంక్షేమ సంఘం, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్ర నిత్యస్ఫూర్తిదాయకం

- వీర వనితల పోరాట చరిత్రను నేటి తరం తెలుసుకోవాలి
- ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



**ఆలేరు, సెప్టెంబరు 18(సమయం న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు పోషించిన పాత్ర మరువలేనిదని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. నిజాం నిరంకుశ పాలన, దొరల దోపిడీకి వ్యతిరేకంగా మహిళలు ధైర్యంగా పోరాడి సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని పేర్కొన్నారు. పాలకుర్తి నుంచి ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాట వీర వనితల స్ఫూర్తి యాత్ర గురువారం రాత్రి ఆలేరు మండలం కొలనుపాకకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభలో గోరేటి వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మహిళలు పురుషులతో సమానంగా ఉద్యమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి తదితర వీర వనితలు తమ పోరాటాలతో మహిళల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు. అన్యాయానికి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా తిరగబడితే హక్కులను సాధించుకోవచ్చనే విశ్వాసాన్ని తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల్లో కల్పించిందని పేర్కొన్నారు. వీర వనితల జీవితాలు, త్యాగాలు, పోరాట చరిత్రను నేటి మహిళలు, యువత అధ్యయనం చేసి స్ఫూర్తి పొందాలని గోరేటి వెంకన్న పిలుపునిచ్చారు.

**చరిత్రలో ప్రత్యేక స్థానం**

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. పాలకుర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ప్రారంభమైన వీర వనితల స్ఫూర్తి యాత్ర ఆరుట్ల కమలాదేవి స్వగ్రామమైన కొలనుపాకలో ముగిసిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు భూమి, భుక్తి, విముక్తి కోసం సాగించిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. మహిళా పోరాట యోధుల త్యాగాలు నేటి తరానికి నిత్యస్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మత సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రజలు ఐక్యంగా ఉండాలని సూచించారు. నాటి వీర వనితల పోరాట స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో సమాన హక్కులు, గౌరవం, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి, కే.ఎన్. ఆశాలత, బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి, బండి పద్మ, జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, కొలనుపాక గ్రామ సర్పంచ్ యాకమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు మెరుగు రమణ, వరలక్ష్మి, కొండా అనురాధ, సరోజ, ఆలేరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ఇంతియాజ్ ఇర్ఫానా, ఐద్వా నాయకురాలు మోరిగాడి స్వరూప, అయిలి చంద్రకళ, మల్లెపల్లి లలిత, మాయారాణి, ఆవుల కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది..

- .గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**ఉట్కూరు మండలం సెప్టెంబర్,18(సమయం న్యూస్)**

తల్లుల ఆరోగ్యమే ఆరోగ్య వంతమైన తరానికి పునాది అని జిల్లా కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామ రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యక్రమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో కుటుంబంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు గర్భధారణ ప్రారంభం నుంచే తల్లి ఆరోగ్యం, పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అందించే ముర్రుపాలు (కొలస్ట్రం) ఎంతో విలువైనవని, మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఆరు నెలల లోపు శిశువులకు తేనె, నీరు తదితర ప్రత్యామ్నాయ ఆహారాలను ఇవ్వకూడదని తెలిపారు. బాలింతలు సంప్రదాయ నమ్మకాల పేరుతో కొన్ని ఆహార పదార్థాలను తీసుకోకుండా ఉండటం సరికాదని, వైద్యుల సూచనల మేరకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువుకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు.

మహిళలు తమ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. గర్భధారణ సమయంలో, ప్రసవం అనంతరం, బాలింతగా ఉన్న సమయంలో తగిన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం తదుపరి తరాల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నడవడికను పిల్లలు అనుసరిస్తారని, అందువల్ల తల్లిదండ్రులు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించి పిల్లలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయకుండా చట్టపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ తెలిపారు. బాలికలు తగిన వయస్సు వచ్చే వరకు విద్యను కొనసాగిస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. చిన్నారులకు అధిక ఉప్పు, నూనెతో తయారైన ప్యాకేజ్డ్ స్నాక్స్, జంక్‌ఫుడ్ అలవాటు చేయకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇంట్లో లభించే పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలతో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు."మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ గర్భిణీల ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందేలా ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీల్లో రక్తహీనతను నిరంతరం పర్యవేక్షించాలని, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి అవసరమైన వైద్యం అందేలా చూడాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపం లేదా తక్కువ బరువుతో ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి అందిస్తున్న అదనపు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ, వారు తీసుకుంటున్నదీ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.మహిళలు, పిల్లల ఆరోగ్యం,పోషకాహారం, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో నిరుగుర్తి గ్రామం ఆదర్శంగా నిలిచేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక కోరారు.అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన జరిపించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, గ్రామ సర్పంచి రాములు, ఉప సర్పంచి సంతోష్ కుమార్,సీడీపీవో వెంకటేశ్వరమ్మ, సూపర్ వైజర్ అంజమ్మ, అంగన్ వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ హిత వనరుగా వెదురు...




**కోస్గి మండలం, సెప్టెంబర్,18(సమయం న్యూస్)** మీర్జాపూర్ లో విద్యార్థులకు అవగాహన పర్యావరణహిత ఆర్థిక వనరుగా వెదురు వనాలు ఎంతోగానో ఉపయోగపడతాయని జాతీయ హరిత దళ సమన్వయకర్త వార్ల మల్లేశం సూచించారు. ప్రపంచ వెదురు వనాల సంరక్షణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వారం నారాయణ పేట జిల్లా కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులకు...పర్యావరణంలో వెదురు వనాల పాత్ర....అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశం వెదురు వనాల విస్తీర్ణంలో 2 వ స్థానంలో ఉందన్నారు. నీటి వసతి,ఎరువులు, పురుగు మందుల అవసరం లేకుండా వెదురు సులభంగా పెరుగుతుందని, చేతివృత్తులు, ఔషధాలు ఫర్నీచర్ తయారీలో ఉపయోగపడుతూ ఎంతోమందికి ఉపాధి అందిస్తుందన్నారు. కృతిమ దారాలకు, ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా బ్రష్ లు, పాత్రలు, ప్లేట్లు, స్టేషనరీ, దుస్తులు, సంగీత వాయిద్య పరికరాలు, వంటి పర్యావరణహిత వస్తువుల తయారీలో పర్యావరణ జీవన విధానానికి వెదురు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆకులు పశుగ్రాసంగా, రాలిన ఆకులు ఎరువుగా మారి నేల ఆరోగ్యాన్ని పెంచుతుందని, వెదురు చెట్లు అడవుల క్షీణతను అడ్డుకుంటుందని, అన్నారు. కాలుష్యం తగ్గించేందుకు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలలో వెదురు దుంగలు వాడతారని, అనేక అసాధారణ లక్షణాలున్న వెదురును బీడు భూముల్లో, పొలం గట్ల వెంబడి విస్తారంగా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వెదురువనాల పై వీడియోలు తిలకించారు. విద్యార్థులు వెదురు ప్రాముఖ్యత పై ఉపన్యాసాలు ఇచ్చారు. అంతకుముందు విద్యార్థులు సమీప వెదురు వనాలనుసందర్శించి ప్రత్యక్ష అవగాహన పొందారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు: కోస్గి ఎస్సై చంద్రశేఖర్.



**కోస్గి మున్సిపల్,(మం) సెప్టెంబర్,18(సమయం న్యూస్)** గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రల సందర్భంగా డీజేల వినియోగంపై నిషేధ ఉత్తర్వులు అమల్లో ఉన్నందున నారాయణపేట జిల్లా కోస్గి, గుండుమల్ మండల ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, డీజే నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్సై చంద్ర శేఖర్ విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, నారాయణపేట ఆర్డీఓ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పండుగలు, ఉత్సవాల ఊరేగింపుల్లో డీజేల వినియోగంపై నిషేధం అమల్లో ఉందని ఎస్సై తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన మరియు సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.డీజేలకు స్వస్తి పలికి, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. అధిక శబ్దంతో కూడిన డీజేలు ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో పాటు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు మరియు అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున డీజే సంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే మండలాల పరిధిలోని డీజే నిర్వాహకులందరికీ నిషేధ ఉత్తర్వులపై అవగాహన కల్పించడంతో పాటు, తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా,సామరస్యపూర్వకంగా నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు, డీజే నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తిగా సహకరించాలని ఎస్సై కోరారు.

## "హిందూ–ముస్లిం ఐక్యతకు, గంగా–జమునా తెహజీబ్ కు ప్రతీక తాండూర్..."

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.



**తాండూరు మున్సిపల్, సెప్టెంబర్,18(సమయం న్యూస్)** తాండూర్ పట్టణంలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత తాండూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాత తాండూర్ శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు దర్గా కమిటీ సభ్యులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని, పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, "తాండూర్ పట్టణం హిందూ–ముస్లిం ఐక్యతకు, గంగా–జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోంది. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ, సోదరభావంతో మెలగడం తాండూర్ ప్రత్యేకత. వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు పోలీసులకు సహకరించాలి" అని అన్నారు.వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ గారు తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలో పాల్గొనే ప్రజలు పోలీసుల సూచనలు, నిర్దేశిత మార్గాలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS, తాండూర్ DSP యాదయ్య, టౌన్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# రోడ్డు భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి

- అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టా లి
- జిల్లా కలెక్ట ర్ ప్రియాంక.



**నారాయణపేట, సెప్టె ంబర్, 18(సమయం న్యూస్)**

రోడ్డు భద్రత పై పటిష్టమైన చర్యలు చేపట్టి, సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత సమావేశంలో కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ...జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరమైన సైనేజీలు, రోడ్డు భద్రతా సూచికలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాలను పరిశీలించి, విద్యార్థు ల భద్రతకు అవసరమైన చోట అదనపు సైనేజీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్అండ్‌బీ, పోలీస్, మున్సిపల్,గ్రామపంచాయతీ తదితర శాఖలు తమ పరిధిలోని రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదాలకు కారణమయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు, రిఫ్లెక్టివ్ స్ట్రిప్స్ తదితర భద్రతా చర్యలను ప్రతిపాదించి అమలు చేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, వాటికి సంబంధించిన వివరాలను తదుపరి సమీక్షా సమావేశానికి సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే రోడ్డు భద్రతకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు సకాలంలో వైద్య సహాయం అందేలా అంబులెన్స్, లైఫ్ సపోర్ట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. 108 అంబులెన్స్ సేవలపై సమగ్రంగా సమీక్షించి, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అంబులెన్స్‌ల సంఖ్య, వాటి సేవల లభ్యత, 24 గంటల అత్యవసర సేవల పరిస్థితి, ప్రమాద ప్రాంతాలకు చేరుకునే మార్గాలు తదితర అంశాలపై స్పష్టమైన వివరాలతో తదుపరి సమావేశానికి ప్రెజెంటేషన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేసి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు, అత్యవసర వైద్య సహాయక వ్యవస్థ , అంబులెన్స్ రూట్ ప్లాన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. రాబోయే గణేష్ నిమజ్జనం కార్యక్రమాల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆర్అండ్‌బీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నారాయణపేట మున్సిపల్ పరిధిలో రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలను గుర్తించి అవసరమైన మేరకు తొలగింపు/కొమ్మల కత్తిరింపు చర్యలు చేపట్టాలని తెలిపారు. పూర్తిగా చెట్లను తొలగించకుండా, అవసరమైన మేరకు కొమ్మలను మాత్రమే కత్తిరించాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు, తీసుకున్న చర్యలు, ప్రస్తుతం చేపడుతున్న పనులు, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.తదుపరి రోడ్డు భద్రత సమీక్షా సమావేశాన్ని అక్టోబర్ మొదటి వారంలో, 14వ తేదీ లోపు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సమావేశానికి కేవలం వివరాలతో కాకుండా శాఖల వారీగా చేపట్టిన పనులు, పురోగతి, తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ప్రెజెంటేషన్లతో అధికారులు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణయ్య, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, ఆర్టీవో మున్నీ, సీ ఐ శివ శంకర్, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ కృష్ణ చైతన్య, నేషనల్ హైవే అధికారి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట

- కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్
- ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం



**కొడంగల్ మున్సిపల్ సెప్టెంబర్,18(సమయం న్యూస్)**

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారి (MEO) రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విశేష ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను శాలువాలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు.

**సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా:**

నర్సింహులు – స్కూల్ అసిస్టెంట్, జడ్పీహెచ్ఎస్, రావల్‌పల్లి డి. కాశప్ప – స్కూల్ అసిస్టెంట్, జడ్పీహెచ్ఎస్, రుద్రారం టి. పూర్ణిమ – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కోడంగల్ ఎస్. గోవర్ధన్ – స్కూల్ అసిస్టెంట్, ఎంపీపీయూపీఎస్, చిట్లపల్లి కె. జ్యోతి – సి.ఆర్.టి., కె.జి.బి.వి., కోడంగల్ ఎం. మహేశ్వరి – ఎస్.జి.టి., ప్రాథమిక పాఠశాల, రావల్‌పల్లి ఇ. ప్రియదర్శిని – ఎస్.జి.టి., ఎంపీపీయూపీఎస్, పర్సాపూర్ వెంకటయ్య – ఎస్.జి.టి., ఎంపీపీఎస్ (హెచ్.సి), కోడంగల్ నసీమ్ బాను – ఎస్.జి.టి., ఎంపీపీయూపీఎస్ (ఉర్దూ), హస్నాబాద్ ఎ. శ్యామలమ్మ – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కోడంగల్ చంద్ర శేఖర్ – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కోడంగల్ ఎస్. ప్రేమలత – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కోడంగల్ సుమతి – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కోడంగల్ ఆర్. ఆనంద్ రావు – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కోడంగల్ యేసురత్నం – స్కూల్ అసిస్టెంట్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కోడంగల్ ఎం. నర్సింహులు – గెజిటెడ్ హెచ్.ఎం., జడ్పీహెచ్ఎస్, హస్నాబాద్ చంద్ర శేఖర్ – గెజిటెడ్ హెచ్.ఎం., జడ్పీహెచ్ఎస్, రావల్‌పల్లి మురళీధర్ – గెజిటెడ్ హెచ్.ఎం., జడ్పీహెచ్ఎస్, అంగడిరాయిచూరు సి. నారాయణ – గెజిటెడ్ హెచ్.ఎం., జడ్పీహెచ్ఎస్, పెద్దనందిగామ జె. వెంకటేశం – గెజిటెడ్ హెచ్.ఎం., జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కోడంగల్ రత్నకళ – స్కూల్ అసిస్టెంట్, ఎంపీపీయూపీఎస్, హస్నాబాద్ ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, నాయకులు అబ్దుల్ హక్, నర్సింగ్, పృథ్వీ సింగ్, విష్ణు కుమార్, అలీ బాషా తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జనం ఉత్సవం

**యాలాల మండలం, సెప్టె ంబర్,18(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా విఘ్ననాధుని నిమజ్జోత్సవ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి, సర్పంచ్ శివప్ప విఘ్ననాధునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏకదంతుని నిమజ్జన కార్యక్రమం శోభాయ మానంగా సాగింది. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పడుతూ గణేష్ మహరాజ్ కి జై అంటూ యువత కేరింతల నడుమ శోభాయాత్ర ముందుకు సాగింది.

